ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

జనవరి 17, 2016

# 3డి అవయవాలు రెడీ

# ఎక్కడో పుట్టి...

నర్గీస్ ఫక్రి

**బాలీవుడ్** తారలుగా ఒక వెలుగు వెలగడమంటే మాటలు కాదు. అందం అభినయంతో పాటు నృత్యగానాల్లోనూ ప్రవేశం వుండాలి. అభిమాన గణాన్ని అలరించి ప్రేక్షక మహాశయుల్ని మెప్పించాలి. అలా హిందీ చిత్రసీమలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న తారలు కొందరు ... ఈ గడ్డ మీద పుట్ట లేదంటే నమ్మశక్యం కాదు. ఎక్కడో పుట్టి ఇక్కడికి వచ్చి స్టార్‌డమ్‌తో దూసుకెళ్తున్న వారిలో ముందుగా చెప్పకోవాల్సింది దీపికా పదుకొనే పేరు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాష్, ట్రావెల్ ఏజెంట్ ఉజ్జలకు కోపెన్‌హెగెన్‌లో జన్మించింది దీపిక. తనకు పదకొండు నెలల వయసులో తిరిగి భారత్ చేరుకుంది. 'ఓం శాంతి ఓం, చెన్నై ఎక్స్‌ప్రెస్, బాజీరావ్ మస్తానీ' లాంటి విజయవంతమైన చిత్రాలతో నెం1 స్థానంలో వుంది. కత్రీనా కైఫ్ హాంగ్‌కాంగ్‌లో పుట్టింది. తండ్రి కాశ్మీరీ, తల్లి బ్రిటిష్. హవాయ్, లండన్‌లో పెరిగిన కైఫ్ ముంబై చేరుకుని బాలీవుడ్ అగ్రతారగా వెలుగొందుతోంది. ఆమీర్‌ఖాన్ మేనల్లుడిగా బాలీవుడ్‌కు పరిచయమైన ఇమ్రాన్ ఖాన్ పుట్టింది విస్కాన్సిన్‌లో. తల్లిదండ్రులు విడిపోయాక భారత్ చేరుకున్నాడు. పై చదువుల కోసం అమెరికా వెళ్లినా తిరిగి ఇక్కడికే చేరుకుని బాలీవుడ్‌లో కెరీర్‌ను ప్రారంభించాడు. కెనడాలో పుట్టిన సన్నీ లియోన్ 'జిస్మ్-2'తో బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసి హాట్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. బహ్రెయిన్‌లో పుట్టిన శ్రీలంక అందగత్తె జాక్వెలిన్ ఫెర్నాండెజ్. 'మర్డర్- 2, రేస్ - 2' చిత్రాలతో బాలీవుడ్‌లో తనకో స్పేస్ సంపాదించుకున్న తార. పంజాబీ తండ్రికి జర్మన్ తల్లికి ఫ్రాంక్‌ఫర్ట్‌లో పుట్టిన ఎవ్లిన్ శర్మ 'ఫ్రమ్ సిడ్నీ విత్ లవ్'తో బాలీవుడ్‌లో కెరీర్ ప్రారంభించింది. మస్కట్‌లో పుట్టి ముంబైలో సత్తా చాటుతున్న నటి సారా జేన్. ఒక్క హిందీ పదం కూడా తెలియకుండానే హిందీ చిత్ర రంగంలో అడుగెట్టిన బ్రిటిష్ నటి అమీ జాక్సన్. నటననే తన కెరీర్‌గా చేసుకున్న అమీ తమిళ, తెలుగు చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులనూ మెప్పిస్తోంది. న్యూయార్క్‌లో పుట్టిన నర్గిస్ ఫక్రి, మోనికా డోగ్రా సైతం బాలీవుడ్‌లో తమకంటూ గుర్తింపు సంపాదించుకున్నారు. వీరందరి పుట్టుపూర్వోత్తరాలూ పరిశీలించాక ఒక విషయం మాత్రం స్పష్టమౌతోంది. ఏ దేశంలో పుడితేనేం! తమ నటనతో, అందంతో ప్రేక్షకులను కట్టి పడేస్తున్నారని!

★

కత్రీనా కైఫ్

ఇమ్రాన్ ఖాన్

జాక్వెలిన్ ఫెర్నాండెజ్

సారా జేన్

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

# అప్పుల కుప్పలు

అప్పిచ్చువాడు, వైద్యుడు లేని గ్రామం నివాసయోగ్యం కాదని సుమతీ శతక కారుడు ఏనాడో చెప్పాడు. దాన్నిబట్టే అప్పు ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ఆస్తి లేనివారున్నారుగానీ అప్పు లేని వారు లేరు. పక్కింటి పుల్లారావుకు, ఎదురింటి ఎల్లారావుకు, వెనకింటి వనజాక్షికి, ముందింటి మంగతాయారుకు... అందరికీ అప్పు వుంటుంది. అప్పు లేని మనిషే కాదు. అప్పు లేని రాష్ట్రం, దేశమూ వుండదు.

ఒకవేళ ఎవరైనా 'నేను పైసా అప్పు చేయలేదు. ఎవరికీ అప్పు తీర్చాల్సిన అవసరం లేదు' అని గుండెల మీద చేతులు వేసుకుని చెప్పినా అది అసత్యమే. ఎందుకంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఏలికలు చేసే అప్పు తలకింత చొప్పున పడి ఎప్పటికప్పుడు వడ్డీతో సహా పెరిగిపోతుంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ రుణగ్రస్తులే. దీనికి జాతి, మత, కుల, వర్గ, వర్ణ బేధాలేం వుండవు. అందరూ సమానమే. అప్పు ఒక్కసారి ఎవరినైనా పట్టిందంటే జలగలా పీడిస్తూనే వుంటుంది. కన్నవారు అప్పు చేసిన పాపానికి పిల్లలు కామందుల దగ్గర బానిసలౌతుంటారు. 'కాల్ మనీ' రక్కసుల బారిన పడి ఇళ్లల్లో ఆడవాళ్ల మానాలను వడ్డీలగా చెల్లించేందుకు అయిష్టంగా సిద్ధపడుతుంటారు. బలవన్మరణాలకూ బలైపోతుంటారు.

మార్పు అనివార్యం అన్న మాట అప్పుకీ వర్తిస్తుంది. 'అప్పు రేపు' నిన్నటి మాట. 'అప్పు తీస్కో. అవసరాలు తీర్చుకో' అన్నది నేటి మాట. ఇల్లు కొనాలన్నా, ఇంట్లోకి వస్తువులు కావాలన్నా... బంగారం, బట్టలు కావాలన్నా...ఉదారంగా అప్పులిచ్చేసి తీరిగ్గా తర్వాత తీర్చుకోమని చెప్తున్నారు చిరునవ్వుతో. ఇక వైద్యం, విద్య సంగతి చెప్పేదేముంది? అప్పు అలా పుడుతూనే వుంటుంది. కాకపోతే వారు చెప్పిన వడ్డీ రేట్లకు, విధించిన షరతులకు డూడూ బసవన్నలా తలూపాల్సి వుంటుంది. ఈ కష్టాలు సామాన్యులకే కాదు. దేవుళ్లకూ, దేశాధినేతలకూ వుంటాయి. కుబేరుడి అప్పు తీర్చలేక ఏడుకొండలవాడు ఎన్నాళ్ల నుంచి బాధ పడుతున్నాడో. తరతరాలుగా వడ్డీ కాసులకు దేవుడే బంధీ అయితే సామాన్యుడిది ఓ లెక్కా! ఇక ప్రభుత్వాలు నడిపేందుకు అధినేతలు లక్షల కోట్ల రూపాయలు అప్పు తీసుకుంటుంటారు. షరతులు వర్తిస్తాయి. ఇక కష్టాలూ మొదలౌతాయి. సామాన్యులకు అప్పులిచ్చేందుకు కాబూలీవాలాలు, వడ్డీ వ్యాపారస్తులు వున్నట్టే ... దేశాలకు రుణాలిచ్చేందుకు ప్రపంచబ్యాంకులు, ఐ.ఎం.ఎఫ్.లూ పుట్టాయి. గ్రీసు కష్టాలు మర్చిపోగలమా! అప్పు తీర్చేందుకు మరో అప్పు! ఈ అప్పు గాథలు ఎన్నెన్నో. ఎద్దు పుండు కాకికి ముద్దు చందంగా ఎన్నేసి సినిమాలో, కథలో!

ఇక ఈ అప్పు అస్త్రాన్ని సంధించి లాభపడాలని చూసే నేతలకూ కొదవు లేదు. రుణ మాఫీ చేస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పేసి ఓట్లు గుద్దించుకొని అందలమెక్కేస్తారు. 'మాఫీ రేపు' అన్నట్లు వ్యవహరిస్తారు. అయితే పెద్దలు చేసిన అప్పులను పారు బకాయిల కింద మాఫీ చేసేస్తారు. అదే బక్కోడు అప్పు తీర్చకపోతే మాత్రం పరువు తీసైనా అప్పు కక్కించమని ఉత్తర్వులు జారీ చేస్తారు. అప్పుకు నీతి నిజాయితీ వుండవు మరి. అందుకే అలా నిరంతరం నడుస్తూ నడిపిస్తూ వుంటుందంతే. ■

◆ మనలో మాట

# టపా

## కదిలించిన అమీరా కథ

**సి**రియా శరణార్థుల గాథలు ఎన్నో చదివాను. జనవరి 3 స్నేహలో ప్రచురించిన 'ఓ అమీరా కథ' మా హృదయాలను కదిల్చివేసింది. నవదంపతులైన సయాద్, అమీనాలు పడ్డ కష్టాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. శరణార్థి శిబిరాల్లో తల దాచుకుంటూ దినదిన గండంగా బ్రతుకుతూ, తమలో ఒక్కరైనా బతకాలనే తపన, అన్ని కష్టాల మధ్యనా తమ బిడ్డకు నవప్రపంచాన్ని చూపాలనే పంతం ఆకట్టుకుంది. అద్దమంటి మసీద్, అల్లు హాస్యజల్లులో చెప్పిన విషయాలు చక్కగా వున్నాయి.

**ఎ. సుచిత్ర, విజయవాడ**

## నవ్వుల వైద్యులు... భలే!

**సూ**దిమందంటే భయపడని పిల్లలుండరు. డాక్టరు చేతిలో సూది చూసి అమడ దూరం పరిగెత్తే పిల్లల కోసం నవ్వుల డాక్టర్లున్నారన్న సంగతులు అశ్చర్యానికి గురి చేశాయి. మన ఆస్పత్రుల్లోనూ క్లౌన్ డాక్టర్లు ఉంటే బావుండనిపించింది. పదమూడవ శతాబ్దం నాటి వీరి ఆనవాళ్లను మాకు పరిచయం చేయడం సంతోషకరం. ఈ క్లౌన్‌డాక్టర్ విశేషాలు చదువుతున్నప్పుడు ఆస్పత్రికి వెళ్లినప్పుడు మా చిన్నోడి పేచీలు, డాక్టరుని చూడగానే గుక్క తిప్పుకోకుండా ఏడ్చి సొమ్మసిల్లిన చేష్టలు గుర్తుకొచ్చాయి. మన చిన్నారులకు నవ్వుల వైద్యుల అవసరం ఎంతైనా వుంది.

**ఎస్.వి.పద్మారావు, కర్నూలు**

## నిజంగా అద్భుతం

**మ**సీదు కట్టడాల్లో ఎన్నో అద్భుతాలు దాగుంటాయి. ఎందుకంటే మహమ్మదీయులు మంచి ఆర్కిటెక్ట్‌లు. వారి కట్టడాలు చూసి మనుషులే కాదు. పావురాళ్ళు సైతం మనసు పారేసుకుని వాలిపోతుంటాయి. ఇక విదేశీయిలైతే ఆ వింత కట్టడాలను తమ కెమేరాల్లో బంధించేందుకు తాపత్రయ పడుతుంటారు. ఈ వారం 'అద్దమంటి మసీదు' ద్వారా ఇరాన్‌లోని షరాగ్ పట్టణంలో నిర్మించిన అద్దాల మసీదు విశేషాలు అశ్చర్య పరిచాయి. మసీదు నిర్మాణాల్లో పొందుపరిచిన రత్నాలు, పచ్చలు అప్పటి రాజుల దర్పానికి చిహ్నాలే అయినా వాటిని అమర్చిన తీరుతెన్నులు నేటితరాలకు గొప్పకానుకలు. ఆ విషయాలు చదువుతూ మేమూ మలేషియా, ఇరాన్ వెళ్లిన అనుభూతికి లోనయ్యాం! మసీదు నిర్మాణాల గురించే కాక అక్కడి అధునాతన సదుపాయాల గురించి చెప్పడం బావుంది.

**- ఎన్. రమేష్, అనంతపురం**
**(ఇ మెయిల్)**

## మార్పు రావాలి

**'వ**ర్ణ చిత్రం' కథ ద్వారా అమ్మాయిలు ఆత్మస్థైర్యంతో ఉండి, మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని చెప్పడం బాగుంది. జడ్జిని సైతం నీళ్లు తాగించేలా బాధితురాలు ప్రశ్నించిన తీరు నేటి తరానికి ఆదర్శం. 'నడిచే ఈతచెట్టు' గురించి చెప్పిన విషయాలు, అల్లు రామలింగయ్య సినీప్రస్థాన వివరాలు ఉపయోగకరంగా, మనోరంజకంగా ఉన్నాయి.

**షామిలి, కర్నూలు.**

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

## ఈ సంచికలో....

# 3డి అవయవాలు రెడీ

**కవర్ స్టోరీ** — 6

**టె**క్నాలజీ రంగం సరికొత్త ఆవిష్కరణలకు అతి పెద్ద వేదిక. తొలి రోజుల్లో ఒక పేద్ద గదిలో పట్టేంత కంప్యూటర్... నేడు ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని మన జేబులో ఇమిడిపోయింది. చరిత్ర గతిని మార్చిన అనేక సాంకేతిక ఆవిష్కరణలను మనం చూస్తున్నాం. అదే క్రమంలో ప్రపంచ గతినే మార్చబోతున్న మరో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణ ప్రపంచాన్ని ఆశ్చర్యచకితులను చేస్తోంది. వైద్యం మొదలుకొని ఫ్యాషన్ రంగం వరకూ, గుండు సూది మొదలుకొని గుండె వరకూ ప్రతిదానికీ ప్రతి సృష్టి చేయగల అద్భుత సాంకేతిక పరిజ్ఞానం మన ముందు ఆవిష్కృతమైంది. అదే... త్రీడీ ప్రింటింగ్.

**విశేషం** ........ 3
మేం విజిలేస్తే..

**స్టార్** ........ 4
ఆహార విప్లవకారుడు

**కార్టూన్ పంచ్** ........ 5

**చూద్దామా** ........ 10
శ్వేత బౌద్ధాలయం

**సినిమా కబుర్లు** ........ 12
వెండితెర అత్తమ్మ

**కవిత్వమ్** ........ 15
ఆత్మ స్థైర్యమే జీవితానికి ఆయుస్సు

**వింత లోకం** ........ 16
క్రెడిట్ రి'కార్డు'

**నవ్వుల్ - పువ్వుల్** ........ 17

**కథ** ........ 18
బొమ్మల కొలువు

**రుచి** ........ 21
మీల్ మేకర్‌తో మజా

**బాల నేస్తాలు** ........ 22
పాండా 'చీమలు'

**ప్రత్యేకం** ........ 24
ట్యాంకెడు పంజాబీదనం

**స్ఫూర్తి** -14
**బాడీ బిల్డర్ బార్బీ**

# మేం విజిలేస్తే...

ఆరతి బెహరా, అనసూయ సాహు, రాజాలక్ష్మి సేథి, అంబు బెహరా ... లాంటి ముప్పై మంది మహిళలు రోజుకు రెండు దఫాలుగా ఇలా ఇళ్లలోంచి బైటకొస్తారు. అదీ ఉదయం నాలుగు గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు. రెండు గంటలపాటు ఊరంతా పర్యటిస్తారు. సాయంత్రాలైతే మరో రెండు గంటలపాటు గ్రామస్తులతో ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. ఈ బృందంలోకి కొత్తగా వచ్చినవారైతే ముగ్గురు నల్గురు చొప్పున గస్తీకి వెళతారు. అదే పాత సభ్యులైతే ఒంటరిగానే విజిల్ వేసుకుంటూ వెళ్తారు. కొన్ని సమస్యాత్మక ప్రాంతాలలో సాయం చేయడానికి స్థానిక పోలీసుల సాయం కూడా తీసుకుంటారు. ఇంతకీ వీళ్లు ఈ సమయాన్నే ఎందుకు ఎంచుకున్నారు? విజిల్ ఊదుతూ ఎవరిని హెచ్చరిస్తున్నారు? ఈల శబ్దం వినగానే వారెందుకు పారిపోతున్నారు? అన్నీ ఉత్సుకత రేకెత్తించే ప్రశ్నలే. సమాధానాలు తెలుసుకోవాల్సిన సందేహాలే.

వారంతా ఒడిషాలోని జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్ వాసులు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లాలంటే మహా యాతనగా వుండేది ఒకప్పుడు. ప్రతి రోజూ కనీసం వెయ్యి మంది విద్యార్థులు, అయిదారొందల మంది సామాన్యులు ఇలాంటి రోడ్లమీదగా రుమాలుతో ముక్కు మూసుకొని ... రోడ్డు మీద జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వచ్చేది. అంతటి దుర్గంధ పూరితంగా, అసహ్యంగా వుండేవా వీధులు. ఇక వర్షాకాలంలో పరిస్థితి మరింత దిగజారిపోయేది. చదువుకునే పిల్లలు, ఉద్యోగులు, పనుల మీద అటుగా వెళ్లే వాళ్లకు నరకం కన్పించేది. కారణం ఒకటే. స్థానికులు బహిరంగ విసర్జన చేయడమే. ఇళ్లల్లో మరుగుదొడ్లు కట్టుకోడానికి ఏమాత్రం సుముఖత చూపక పోవడమే.

**తెల్లవారుజాము...నాలుగు గంటల సమయం. ముప్పై మంది ఆడవాళ్లు ఇళ్లలోంచి బైటకొచ్చారు. ఒక్క విజిల్ తప్ప వాళ్ల చేతిలో మరేమీ లేవు. తమ గ్రామంలోని వీధులన్నీ గస్తీ తిరగనారంభించారు. ఎక్కడైనా ...ఎవరైనా ... అనుమానాస్పదంగా కనిపిస్తే చాలు. విజిల్ నోట్లో పెట్టుకుని జోరుగా ఊదసాగారు. సుదూరంగా లీలగా విజిల్ శబ్దం వినిపించినా సరే... కొందరు హడావిడిగా అక్కడి నుంచి జారుకుంటున్నారు. ఒడిషాలోని గంజాం జిల్లాలో కనిపించే అసాధారణ దృశ్యమిది. ఇంతకీ ఇంతమంది మహిళలు మూకుమ్మడిగా ఎందుకు బయల్దేరారు?**

2011 గణాంకాల ప్రకారం గ్రామీణ ఒడిషాలో 85.9 శాతం ఇళ్లలో మరుగుదొడ్డి లేదు. గంజాంలో 80.9 శాతం ప్రజలు బహిరంగ విసర్జనకే మొగ్గు చూపుతున్నారు. జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్‌లో కేవలం 15 శాతం ఇళ్లల్లో మాత్రమే దొడ్డి వుంది. పర్యవసానంగా... అధిక కుటుంబాలు తమ ఆదాయాలను వైద్యానికే ఖర్చు చేయడం తప్పనిసరి. డయేరియా, మలేరియా వంటి జబ్బులు ఇంటి చుట్టాల్లా ఎప్పుడూ అంటిపెట్టుకునే వుండేవి. ఒక్క జగన్నాథ్ బ్లాక్‌లోనే 16,600 మంది సభ్యులతో 1250 స్వయం సహాయక బృందాలు (ఎస్.జి.హెచ్) వుండేవి. ఆస్పత్రి బిల్లులు కట్టడం కోసమే ఎస్.జి.హెచ్ మహిళలు అప్పులు తీసుకునేవారు. ఓ కుటుంబం ఆస్పత్రికి కట్టే డబ్బును వెచ్చిస్తే ఇంట్లో శాశ్వత మరుగు దొడ్డి ఏర్పడుతుందని, ఇంటిల్లిపాదికి దోమతెరలు కొనుక్కోవచ్చని ఆలోచనే చేసేవారు కాదు. వారిని ఇలాగే వదిలేస్తే తమ ఆరోగ్యం గాలిలో దీపం అవుతుందని, ఏదైనా శాశ్వత పరిష్కారాన్ని ఆలోచించాల్సిందిగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బి.డి.ఒ)... బ్లాక్ మహిళా సంఘాన్ని కోరారు. అలా ఉద్భవించిన ఆలోచనే 'విజిల్ బహిని'. ముప్పై మంది మహిళలు విజిళ్లు తీసుకొని ఉదయం సాయంత్రం గస్తీ తిరగాలని నిశ్చయించుకున్నారు. సాధారణంగా చెంబులు తీసుకుని బయటికి రావడానికి అవే కీలకమైన సమయాలు కనక అంతే... విజిల్ వేస్తూ వచ్చిన మహిళలను చూసి మొహం చెల్లక పలాయనం చిత్తగిస్తారు. అలా కూడా వీలుకాని ప్రాంతాల్లో తులసి మొక్క నాటసాగారు. తులసి పవిత్రమైనదిగా భావిస్తారు కనక... ఆ పరిసరాలను పంకిల పరిచేవారు కాదు. ప్రధానంగా గ్రామస్తుల తరపున మరుగుదొడ్లు కట్టుకోడానికి గాను నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్ బి ఎ) పథకం కింద అనుమతి ఇవ్వాల్సిందిగా దరఖాస్తులు పెట్టేవారు.

షెడ్యూల్ కులాలు, తరగతులు, చిన్న సన్నకారు రైతులు, పేదరిక రేఖకు దిగువన వున్నవారికి ఆ పథకం కింద లభించే సదుపాయాలన్నీ పొందుతారు. ఇతరులకు మాత్రం ప్రభుత్వ సబ్సిడీ అందుతుంది. లేదా స్థానికంగా స్వయం సహాయక బృందాల్లో మరుగుదొడ్లు కట్టుకోడానికి కావాల్సిన రుణాలు తీసుకునే అవకాశం లభిస్తుంది. దాంతో గ్రామస్తుల్లో బహిరంగ విసర్జన పట్ల కొంత అవగాహన కల్గి సొంతగా నిర్మించుకుంటున్నా ...

కొందరు తమ పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. అందుకే... మహిళలు నేటికీ విజిళ్లు ఊదుతూ...తమ వంతుగా చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తూనే వున్నారు. ✦

# ఆహార విప్లవకారుడు

**పెద్ద పెద్ద చేపల్ని పట్టే తమ ఊరి మత్స్యకారులతోనే చిన్ననాటి జ్ఞాపకాలన్నీ నిండిపోయాయి విజయ్ గుప్తాకు. తాను పెద్దవాడైనా కూడా వారంతా ఇంకా అలాగే నిరుపేదలుగా ఎందుకు మిగిలిపోయారనే ప్రశ్న తొలిచేసేది. వారూ ఆకలితో అలమటిస్తున్నారనే విషయం ఆశ్చర్యం కలిగించింది. వారే కాదు ప్రపంచంలో ఎన్నో కోట్ల మందికి ఆహారం కల అనే వాస్తవం తెలిసి గుప్తా ఓ సంకల్పాన్ని తీసుకున్నాడు. ఆహార సమస్య పరిష్కారానికి అంకితమై చేపల పెంపకంపై పరిశోధనలతో నీలి విప్లవానికి పెద్ద దిక్కుగా నిలిచాడు.**

ఇప్పటికే 80 కోట్ల మంది ఆకలికి బలి అవుతున్నారని లెక్కలు. 2050 కల్లా భారీగా పెరగనున్న జనాభాకు సరిపడా ఆహార ఉత్పత్తికి వ్యవసాయం సరిపోదు. గత 8000 ఏళ్లలో పండించిన ఆహారాన్ని రానున్న 35 ఏళ్లలో సాధించగలగాలి. ఈ లెక్కలన్నీ ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ వేసింది. కానీ ఓ వైపు పర్యావరణ సమస్యలు, ఎడారి ప్రాంతాల విస్తరణ, వ్యవసాయ భూముల సారం తగ్గుదల, జనావాసాల పెరుగుదల ఇలాంటివెన్నో సమస్యలు మరింత తీవ్రమైన వ్యవసాయ సంక్షోభానికి నెట్టేస్తున్నాయి. మరో హరిత విప్లవం, క్షీర విప్లవం సాధ్యమైనా పూర్తిగా సమస్య పరిష్కారమవదు. నీలి విప్లవం తోడైతేనే ఆకలి మంటలు సమాధానపడతాయి. యానిమల్ ప్రొటీన్ ఎక్కువగా ఉండే, చవకగా దొరికే చేపల ఆహారంతో పేద దేశాలకు గొప్ప మేలు చేకూరుతుంది. పోషకాహార లోపానికి చెక్ పెడుతుంది. ఆ నీలి విప్లవం ఇప్పటికే ప్రారంభమైంది. ఎప్పుడో మొదలైంది. అది కూడా మన తెలుగువాడు బాపట్లకు చెందిన ఆక్వా కల్చర్ శాస్త్రవేత్త మోదడుగు విజయ గుప్తా ఈ నీలి విప్లవానికి సారథ్యం వహిస్తున్నారు. 'ఆకలితో ఉన్న వ్యక్తితో శాంతి మంత్రాలు పలుకలేం. ఆహార భద్రతలేని ప్రపంచ శాంతి సాధ్యంకాదు.' అని గుప్తా అంటారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితితో పాటు అనేక సంస్థలతో కలిసి భవిష్యత్తు తరాల ఆహార భద్రత కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న గుప్తాకు నోబెల్ శాంతి పురస్కారానికి సమాంతరమైన సన్‌హాక్ శాంతి బహుమతి గతేడాదే లభించింది. భవిష్యత్తు ప్రపంచశాంతికి భరోసానిచ్చే వ్యక్తుల కృషికి ఈ అవార్డును అందిస్తారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో జీవ శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన ఆయన 1962 నుంచి 1977 వరకు భారత వ్యవసాయ పరిశోధన సమితికి సేవలందించి ఆ తర్వాత ఐక్యరాజ్య సమితితో కలిసి పని చేశారు. మలేషియాలోని ప్రపంచ మత్స్య పరిశోధన సంస్థ 'వరల్డ్ ఫిష్'లో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ఆసియా పసిఫిక్ చేపల ఉత్పత్తిలో తిరుగులేని శక్తిగా మార్చడంలో ఆయన పాత్ర మరువలేనిది. ఐదు దశాబ్దాలుగా ఆక్వా కల్చర్ పరిశోధనలు సాగిస్తున్న ఆయన ల్యాబ్‌ల్లోని పరిశోధనల సారాన్ని గ్రామ నీటి మడుగుల్లోకి మళ్లించారు. విలాసవంతమైన ఆతిథ్యాలను విడిచి మారుమూల గ్రామాల్లో కనీస సౌకర్యాలకు దూరంగా కుటుంబంతో సహా కదిలి దీక్షగా తన పనిచేసుకుపోయారు. వారితో కలిసిపోయాడు. వారి భాష నేర్చుకున్నాడు వారి ఆపద్బాంధవుడయ్యాడు. బంగ్లాదేశ్, లావోస్, చైనా, ఇండియా, మలేషియా, ఇండొనేషియా, ఐవరీ కోస్ట్, ఫిజీ, వియత్నాం వంటి 20కు పైగా దేశాల్లో ఆయన పరిశోధనలు ఆక్వా కల్చర్ రంగంలో పెను మార్పులు సృష్టించాయి. పేదోడి కడుపు నిండటంతో పాటు ఆర్థికంగా పుంజుకునేందుకు ఆదరువు అయ్యింది. అటు ఆహార సంక్షోభ ప్రభావాన్ని తగ్గిస్తూనే సామాజిక మార్పుకు కారణమైంది. గ్రామ సభలు ఏర్పాటు చేసి స్త్రీ సాధికారత గురించి పురుషులకు అర్థమయ్యేలా చెప్పారు. చేపల పెంపకంపై శిక్షణనిచ్చి స్త్రీలను భాగస్వాములుగా చేశారు. వీటితో 350 కిలోల చేపలు పెంచే చోట 2500 కిలోల మత్స్య సంపదకు వీలు కలిగింది. ఇది ఆకలితో, పేదరికంతో విలవిల్లాడిపోతున్న 20 ఏళ్ల కిందటి బంగ్లాదేశ్‌కు గొప్ప వరమైంది. బంగ్లాదేశ్‌లోని చేపల పెంపకంలో 65 శాతం మంది గ్రామీణ స్త్రీలదే పైచేయి. అది వారికి ఆర్థిక దన్నుతో పాటు సామాజిక స్వేచ్ఛ, సాధికారతను కలిగించింది. వియత్నాం లాంటి యుద్ధ సంక్షోభ దేశాల్లోను ఓ వైపు యుద్ధం సాగుతున్నా ప్రాణాలకు లెక్కచేయకుండా తన కార్యక్రమాల్ని లోలోపలి ఆవాసాల్లోకి చొచ్చుకువెళ్లేలా చేశారు. రెబల్ శాస్త్రవేత్తగా ముద్ర వేసుకున్న ఆయన సేవలన్నీ పేదల గుత్త హక్కు అని చెబుతారు. చాలా వరకు ఎటువంటి పరిస్థితుల్లో అయినా మనుగడ సాగించే తిలేపియా చేపలపై పరిశోధనలు చేసి వాటికి చెందని మెకాంగ్ నది వరకు మత్స్య సంపదను తీసుకెళ్లాడు. గుప్తా భారీ చేపల చెరువులు, ప్రత్యేక చేపల ఆహారంతో సమస్యలకు పరిష్కారం వెతకలేదు. అనేక ఆసియా దేశాల్లోని గ్రామాల్ని సందర్శించిన ఆయనకు ఎదురైనవన్నీ కూడా దారి పక్కన చిన్న నీటి కుంటలు, మడుగులు, చిన్నపాటి చెరువులు వంటి నీటి సముదాయాలే. వాటిల్లో చేపల పెంపకం అనేది అప్పట్లో ఎవరికీ తట్టని ఆలోచన. ఈ విషయంపైనే దృష్టి సారించిన గుప్తా ఆ మడుగుల్లోనే హాని లేని చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టేలా పరిశోధన సాగించారు. ఖరీదైన పరికరాలు, చేపల ఆహారం కాకుండా వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలను వాడి ఖర్చు అమాంతం తగ్గేలా చేశారు. మంచి నీటి చేపల ఆక్వా కల్చర్‌ను విజయవంతం చేశారు. ఈ సేవలకు గుర్తుగానే ఫుడ్ ప్రైజ్ 2005లోనే ఆయన్ను వరించింది. ఫలాల్ని అనుభవిస్తున్న కోట్ల మంది గుండెల్లో గుప్తా చోటు దక్కించుకున్నారు. ✦

పాక్‌తో.. చర్చలు అనగానే.. ఇదిగో.. ఇలా..
కుప్పిగంతు వేస్తున్నారు!!
గంగాధర్


ఫించన్లు
వినతులు
విజ్ఞప్తులు
రైతు రుణాలు
రేషన్ కార్డులు
జన్మభూమిలో లక్షలకు అర్జీలు

సింబాలిక్‌గా వాడుకోవచ్చు.. తీసుకెళ్లండి!
అమరావతి కోసం..

# కార్టూన్

# పంచ్


టూరిస్ట్.. కాదు మేడమ్ మన యువరాజావారే!!
విదేశీయాత్ర చేసొచ్చిన రాహుల్

# 3డి అవయవాలు రెడీ


రాజాబాబు కంచర్ల
9490099231


**టెక్నాలజీ రంగం సరికొత్త ఆవిష్కరణలకు అతి పెద్ద వేదిక. తొలి రోజుల్లో ఒక పేద్ద గదిలో పట్టేంత కంప్యూటర్... నేడు ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని మన జేబులో ఇమిడిపోయింది. చరిత్ర గతిని మార్చిన అనేక సాంకేతిక ఆవిష్కరణలను మనం చూస్తున్నాం. అదే క్రమంలో ప్రపంచ గతినే మార్చబోతున్న మరో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణ ప్రపంచాన్ని ఆశ్చర్యచకితులను చేస్తోంది. వైద్యం మొదలుకొని భవన నిర్మాణ రంగం వరకూ, గుండు సూది మొదలుకొని గుండె వరకూ ప్రతిదానికీ ప్రతి సృష్టి చేయగల అద్భుత సాంకేతిక పరిజ్ఞానం మన ముందు ఆవిష్కృతమైంది. అదే... త్రీడీ ప్రింటింగ్. ఈ త్రీడీ ప్రింటింగ్ ద్వారా ఆహార పదార్థాల నుంచి భవంతుల వరకు రూపొందించడం ఒక ఎత్తు అయితే... మానవ శరీర అవయవాలను రూపొందించడం మరో వింత.**

తాజాగా 'బాహుబలి' సినిమాలో ఉపయోగించిన 100 అడుగుల భల్లాలదేవ (రానా) విగ్రహం తయారీకి కూడా త్రీడీ ప్రింటింగ్ సహాయం తీసుకున్నారు. లోహపు పుర్రె అమర్చడం వల్ల ఓ పాప ప్రాణాంతక వ్యాధి నుంచి బయటపడింది... ఇది మన కళ్ల ముందు కనిపిస్తోన్న వాస్తవం. భవిష్యత్‌లో ఆసుపత్రులలోనే మనకు కావాల్సిన అవయవాలను మార్పిడి చేయించుకునే సదుపాయం రానుంది. ఇప్పటికే కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో 3డిలో ముద్రించిన అవయవ మార్పిడి జరుగుతోంది. మరో రెండు మూడేళ్లలో ఇది మరింత అందుబాటులోకి రానుంది. ఇదంతా 3డి ప్రింటింగ్ మహత్యం. 3డి ప్రింటింగ్ టెక్నాలజీ గురించి గత కొన్నేళ్లుగా వింటూనే ఉన్నాం. అయితే... ఇరవయ్యేళ్ల క్రితమే ఈ సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కృతమైనా సరికొత్త హంగులతో ఇప్పుడు వేగం పుంజుకుంది. వస్తువుల నిజ రూపం ఏవిధంగా ఉంటుందో అలాగే తిరిగి ముద్రించడాన్ని 3డి ప్రింటింగ్ లేదా త్రిమితీయ ముద్రణ అంటారు. వాస్తవానికి ఈ ప్రింటింగ్ విధానం 1986వ సంవత్సరంలోనే అందుబాటులోకి వచ్చింది. కానీ 1990 వరకు పెద్దగా వినియోగానికి నోచుకోలేదు. సాధారణ ప్రింటర్ 2డి రకానికి చెందింది. ఇందులో పొడవూ వెడల్పూ మాత్రమే ఉంటాయి. అదే 3డిలో లోతూ తోడవుతుంది. అంటే, ఓ పరిపూర్ణ ఆకారానికి సరిపడా కోణాలన్నీ వచ్చేసినట్టే. ఈ ప్రింటర్‌లో సిరాకు బదులు ప్లాస్టిక్, పాలీయుథెరిన్, ఎపాక్సీ, మెటల్ పౌడర్‌ను వాడతారు. దీనిలో ముద్రించే ముద్రణ రూపాన్ని కంప్యూటరులో కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ (క్యాడ్) ఫైల్‌గా రూపొందించి, దానికి అనుసంధానంగా వున్న 3డి ప్రింటర్ ద్వారా ముద్రిస్తారు. 3డి ముద్రణలో వస్తువు యొక్క నిర్మాణం పొరలు పొరలుగా నిర్మితమవుతుంది. 3డి ప్రింటింగ్ సాధారణంగా పదార్థ ప్రింటర్‌తో చేస్తారు.

డెస్క్‌టాప్ ఫ్యాబ్రికేషన్‌గా పిలవబడే ఈ ప్రక్రియ వైద్యరంగంలో ప్రాధాన్యాన్ని



సంతరించుకుంటోంది. ఉదాహరణకు శరీరంలోని వివిధ భాగాలు ఏ ఆకతిలో ఉంటాయో అలాంటి ఆకతులలో ముద్రణలు తీసుకోవచ్చు. 3డి ప్రింటింగ్ టెక్నాలజీ వైద్యరంగంలో పెను మార్పులకు కారణం అవుతోంది. శాస్త్రవేత్తలు 3డి బయో ప్రింటర్ సాయంతో కత్రిమ గుండెను కూడా తయారు చేశారు. అంతేకాకుండా.. ఈ పరిజ్ఞానంతో విరిగిపోయిన దంతాల్ని పునరుద్ధరించుకోవచ్చు. తెగిపోయిన ముక్కూ చెవుల స్థానంలో కొత్తవి అతికించుకోవచ్చు. అంతేకాదు...కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ వైద్యశాస్త్రంలో సరికొత్త మార్పులకు కారణం కాబోతోంది. త్రీడీ ప్రింటరుతో నేరుగా ఒంటిమీదే చర్మాన్ని ప్రింట్ చేసుకునే ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి.

ప్రపంచంలోనే మొట్ట మొదటిసారిగా 2014 మార్చిలో 3డి ప్రింటింగ్ సాంకేతికతను ఉపయోగించి.. నెదర్లాండ్స్‌లో ఒక యువతికి పుర్రె మార్పిడి శస్త్రచికిత్స చేశారు. 3డి ప్రింటర్‌తో.. ఆకారం, పరిమాణం సహా అచ్చంగా ఆ మహిళ పుర్రెను పోలిన కృత్రిమ ప్లాస్టిక్ పుర్రెను, పుర్రె భాగాలను శాస్త్రవేత్తలు ప్రింట్ చేసి అమర్చారు. నెదర్లాండ్స్‌లోని యూట్రెచ్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ వైద్యులు.. దాదాపు 23 గంటలపాటు సుదీర్ఘ శస్త్రచికిత్స చేసి, ఆమెకు కృత్రిమ పుర్రెను అమర్చారు. 3డి ప్రింటింగ్ సాంకేతికతతో వైద్య శాస్త్రంలో మరెన్నో అద్భుతాలను సుసాధ్యం చేయవచ్చని యూట్రెచ్ వర్సిటీ వైద్యుడు బోన్ వెర్వేజ్ చెబుతున్నారు.

లండన్ వైద్య నిపుణులు ఓ మహిళకు సహజమైన పుర్రె స్థానంలో 3డి పుర్రె బిగించారు. పాకిస్తాన్‌లో తాలిబన్ల దాడికి గురైన నోబెల్ బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ తలకు గాయమైనప్పుడు త్రీడీ పుర్రె సాయంతోనే ఆమెకు వైద్యం చేశారు. జర్మనీ శాస్త్రవేత్తలు 3డి టెక్నాలజీతో రోబో చేతుల్నీ కాళ్లనూ తయారు చేస్తున్నారు. వేళ్లలో కదలిక ఉంటుంది, ఆకతిని బట్టి పరిమాణాన్నీ ఛాయను బట్టి రంగునూ మార్చుకునే వీలుంది. 3డి ప్రింటర్ ద్వారా గర్భస్థ శిశువు ప్రతిరూపాన్ని కూడా తీసుకునే అవకాశమూ ఉందిప్పుడు. ఈ ప్రక్రియ ద్వారా పిండాన్ని మరింత క్షుణ్ణంగా పరీక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. 3డి ప్రింటింగ్ ఆవిష్కరణలో 3డి వైద్య ప్రింటింగ్ విధానం విప్లవాత్మకమైనది. 3డి ఇంప్లాంట్స్ ముద్రణలు, శస్త్రచికిత్స నమూనాలను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. ప్రస్తుతం శరీరం లోపల అమర్చే అవయవాలు, రక్తనాళాలు, కణ జాలం కోసం ప్రయోగాలను విస్తృతం చేశారు.

**ప్రింటింగ్ ప్రక్రియ**

3డి ప్రింటింగ్‌కు ప్రధానంగా కావాల్సినవి 3డి ప్రింటర్, మాయా, ఆటోక్యాడ్ వంటి ప్రత్యేకమైన సాంకేతిక పరిజ్ఞానమున్న కంప్యూటర్, 3డి స్కానర్ అవసరమౌతాయి. జిరాక్స్ మెషీన్‌తో కాగితాలపై ప్రింట్ చేసిన మాదిరిగా 3డి ప్రింటర్‌లో అవసరాన్ని బట్టి సిరామిక్, ప్లాస్టిక్, లోహాలు వాడుకోవచ్చు. ఫిలమెంట్, గుళికలు, పౌడర్ రూపంలో ముడి సరుకు లభ్యమౌతున్నాయి. కంప్యూటర్ నుండి సంకేతాలు ప్రారంభం కాగానే మనం కోరుకున్న నమూనాలో ప్రింటింగ్ ప్రారంభం అవుతుంది. 1984 ప్రాంతంలో చార్లెస్ హల్ అనే శాస్త్రవేత్త ఆలోచనల నుండి పుట్టిందే ఈ సరికొత్త ఆవిష్కరణ. 1986లో అందుబాటులోకి వచ్చినా 1990 వరకు పెద్దగా వినియోగించలేదు. వైద్యం, నిర్మాణం, పరిశ్రమలు, ఫ్యాషన్ వంటి ప్రతి రంగాన్నీ 3డి ప్రింటింగ్ టెక్నాలజీ ప్రభావితం చేస్తోంది. ప్లాస్టిక్ లాంటి పదార్థాలతో తయారు చేసిన ఫిలమెంట్ లేదా ఇతర పదార్థాలు అవసరమవుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.15 వేల నుంచి లక్ష రూపాయల వరకూ ఖరీదు చేసే రకరకాల 3డి ప్రింటర్లు అందుబాటులో ఉన్నాయి.

**భవిష్యత్ త్రీడీదే**

ఈ టెక్నాలజీకి అద్భుతమైన భవిష్యత్ వుంటుందని నిపుణులు భావిస్తున్నారు. 2018 నాటికి 3డి ప్రింటింగ్ మార్కెట్ విలువ దాదాపు 18 బిలియన్ డాలర్లు అంటే లక్ష కోట్ల రూపాయల వరకూ ఉంటుందని నిపుణుల అంచనా. దీన్ని బట్టే ఈ టెక్నాలజీ పట్ల అంచనాలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో ఈ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెంది బయో ప్రింటింగ్‌గా రూపాంతరం చెందుతుందని కొందరు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పుడు శరీర అవయవాలను కూడా పరిశోధనశాలల్లో ప్రింట్ చేసుకుని వాడవచ్చని అంచనా. ప్లాస్టిక్ లాంటి పదార్థాలకు బదులుగా జీవకణాలను కృత్రిమ పద్ధతుల్లో పెంచి ప్రత్యేకమైన ప్రింటర్లు ఉపయోగించడం ద్వారా అవయవాలను ఉత్పత్తి చేయడం సాధ్యమేనని వీరు అంటున్నారు. ఇప్పటికే కణజాలంతోపాటు కొంతమేరకు రక్తనాళాలను కూడా 3డి ప్రింటింగ్ సాయంతో తయారు చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో గుండెపోటు ద్వారా దెబ్బతినే కణజాలానికి ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు.

3డి ప్రక్రియ గురించి, దాని మీద జరుగుతున్న ప్రయోగాలు, కలిగే ప్రయోజనాల గురించి రేఖామాత్రంగా తెలుసుకున్నాం. అయితే విడివిడిగా పలు రకాల 3డి అవయవాల విశేషాలు చెప్పుకుందాం.

**3డి ముక్కు**

అమెరికాలో 14ఏళ్ల అబ్బాయికి తొలిసారిగా 3డి ప్రింటెడ్ ముక్కును వైద్యులు విజయవంతంగా అమర్చారు. ఆ అబ్బాయి తొమ్మిదేళ్ల ఉన్నప్పుడు విద్యుత్ తీగల మీద పడడంతో ముఖం పూర్తిగా పాడైపోయింది. దీంతో

ఆ బుడతడికి 3డి ముక్కును అమర్చారు. మార్షల్ ద్వీపానికి చెందిన డాలన్ జెన్నెట్ అనే పద్నాలుగేళ్ల చిన్నారికి గతేడాది డిసెంబర్‌లో ఈ అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఓ రోగికి 3డి ద్వారా ప్రింట్ చేసిన ముక్కును అమర్చడం అమెరికాలో ఇదే తొలిసారి అని మీడియా వెల్లడించింది. శస్త్రచికిత్సల నిమిత్తం జెన్నెట్ న్యూయార్క్ వెళ్లాడు. అక్కడ వాసన పీల్చుకోవడానికి, రుచి తెలియడానికి, ఇంకా చాలా శస్త్రచికిత్సలు జరిగాయి. తాజాగా ముక్కును కూడా అమర్చారు.

**కృత్రిమ దవడ**

ప్రపంచంలోనే తొలిసారిగా 2013లో 3డి ప్రింటింగ్ సాయంతో బ్రిటన్ డాక్టర్ ఈ కృత్రిమ ముఖాన్ని సృష్టించగలిగాడు. ఎరిక్ మోగర్ (60) బ్రిటన్ రెస్టారెంట్ మేనేజర్. నాలుగేళ్ల క్రితం అతని ముఖం ఎడమ దవడలో కణితి పెరిగింది. అది పరీక్షించిన వైద్యులు క్యాన్సర్ కణితిగా నిర్ధారించి, ఆ భాగాన్ని పూర్తిగా తొలగించారు. దీంతో ఎరిక్ ఆ భయానక మహమ్మారి బారి నుండి అయితే తప్పించుకోగలిగాడు కానీ ముఖం మాత్రం అంద వికారంగా అయిపోయింది. తినడం, తాగడం కష్టమైపోయింది. తన ముఖాన్నీ తానే చూసుకోలేకపోయేంత భయంకరంగా అయిపోయింది. అయితే వైద్యుల సలహా మేరకు 3డి ప్రింటింగ్‌పై పరిశోధనలు చేస్తున్న డెంటిస్ట్ యాండ్రో దావుద్‌ను కలిశాడు. యాండ్రో తన మిత్రుడితో కలిసి త్రిడి ప్రింటింగ్‌తో రోగులకు కృత్రిమ దవడ ఎముకలను అమర్చడంపై



అధ్యయనం చేసి సక్సెస్ అయ్యాడు. అయితే ఎరిక్ కేస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆయన 3డి ప్రింటింగ్ ద్వారా నైలాన్ ప్లాస్టిక్‌తో కలిపిన ఒక్కొక్క పొర చొప్పున పేర్చుకుంటూ కృత్రిమ ముఖాన్ని రూపొందించాడు. అనంతరం దాన్ని ఎరిక్‌కు విజయవంతంగా అమర్చగలిగాడు.

**బయోనిక్ చెవి**

సాధారణ మానవ చెవి కంటే అధిక సామర్థ్యంతో, ఎక్కువ దూరం రేడియో ఫ్రీక్వెన్సీని



వినగలిగిన కృత్రిమ బయోనిక్ చెవిని శాస్త్రవేత్తలు రూపొందించారు. 3డి ప్రింటింగ్ ప్రక్రియలో దీనిని రూపొందించడం విశేషం. న్యూజెర్సీలోని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు 3డి ప్రక్రియ ద్వారా కణాలను, అతి సూక్ష్మ పరమాణువులను ముద్రించే పరిజ్ఞానాన్ని విజయవంతంగా సుసాధ్యం చేశారు. దీనితోపాటు కార్టిలేజ్‌తో కూడిన చిన్న కాయిల్ యాంటెన్నా సాయంతో బయోనిక్ చెవిని రూపొందించారు. శాస్త్రవేత్తలు మైఖెల్ మెక్‌ఆల్పైన్, నబీస్ వర్మలు చేపట్టిన ఈ అధ్యయనంలో ఎలక్ట్రానిక్స్‌ను, బయోలజీని కలిపి 3డి పద్ధతిలో నిర్మాణాల్ని రూపొందించడంలో సరికొత్త విధానానికి తెరతీశారు. ప్లాస్టిక్ సర్జరీ, పునర్నిర్మాణ సర్జరీ విభాగాల్లో సైతం అత్యంత క్లిష్టమైన చెవిని వీరు 3డి ప్రింటింగ్ ప్రక్రియ ద్వారా రూపొందించారు. ఈ ప్రింటర్లు కంప్యూటర్ డిజైన్ సాయంతో వస్తువులను రూపొందిస్తాయి. ఈ ప్రింటర్ ప్లాస్టిక్ మొదలు కణాల దాకా భిన్నమైన పదార్థాలను సన్నని పొరల్లా ఒక చోట చేర్చి అవసరమైన ఆకతిని నిర్మిస్తుంది. కణజాలాన్ని ఎలక్ట్రానిక్స్‌తో అనుసంధానించేందుకు 3డి ప్రింటింగ్ ప్రక్రియ సౌకర్యవంతమైన విధానమని శాస్త్రవేత్తలు రుజువు చేశారు. ఎలక్ట్రానిక్స్, జీవ సంబంధ పదార్థాలను కలిపే విషయంలో ఎదురయ్యే మెకానికల్, థర్మల్ సవాళ్లను అధిగమించినట్లు పరిశోధకులు పేర్కొన్నారు.

**3డి లోహపు పుర్రె**

ప్రపంచ వైద్యచరిత్రలోనే అత్యంత కీలకమైన పుర్రె మార్పిడి శస్త్రచికిత్సను చైనా వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. హైడ్రోసెఫలస్



**పక్కటెముకలు**

**3డి** పరిజ్ఞానంతో ముద్రించిన ఉరోస్థి (స్టెర్నమ్), పక్కటెముకల గూడును ఒక క్యాన్సర్ రోగికి వైద్యులు విజయవంతంగా అమర్చారు. ఈ తరహా శస్త్ర చికిత్సను చేపట్టడం ప్రపంచంలోనే ఇది తొలిసారి. స్పెయిన్‌లోని సలమాన్కా విశ్వవిద్యాలయ ఆసుపత్రి వైద్యులు ఈ ఘనత సాధించారు. 54 ఏళ్ల ఈ రోగికి ఛాతీ గోడ సర్కోమా తలెత్తింది. ఇది పక్కటెముకల చుట్టూ వద్ధి చెందే ఒక రకమైన కణితి. దీంతో రోగి పక్కటెముకల గూడులో కొంత భాగాన్ని తొలగించి, కృత్రిమ ఇంప్లాంట్లను అమర్చాల్సి వచ్చింది. రోగికి అమరేలా 3డి ముద్రణ పరిజ్ఞానంతో పక్కటెముకల గూడును తయారు చేయడం మేలని గుర్తించిన వైద్యులు అత్యధిక రిజల్యూషన్ కలిగిన సీటీ డేటా సాయంతో రోగి ఛాతీ గోడ, కణితిని 3డిలో ఆవిష్కరించారు. ఈ వివరాల ఆధారంగా మెల్‌బోర్న్‌లోని కామన్‌వెల్త్ శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన సంస్థకు సంబంధించిన 3డి ముద్రణ కేంద్రంలో ఉరోస్థి, పక్కటెముకల గూడును టైటానియం మిశ్రమ లోహంతో తయారుచేసి రోగికి అమర్చారు.

**కాలేయ నమూనా**

**3డి** కణాలతో కూడిన ఒక పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివద్ధి చేశారు. అది కాలేయ విధులను అనుకరిస్తుంది. దీన్ని ఔషధ పరీక్షలకు, రోగికి ప్రత్యేకించిన ఔషధాల తీరుతెన్నులను పరిశీలించడానికి ఉపయోగించవచ్చు. వేక్ ఫారెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీజెనరేటివ్ మెడిసిన్, వర్జీనియా టెక్-వేక్ ఫారెస్ట్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బయోమెడికల్ ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరికరాన్ని రూపొందించారు. ఇందుకు 3డి కాలేయ కణ శ్రేణిని ఉపయోగించారు.



## 3డి గుండె

**3డి** ప్రింటర్ ఒక చిన్నారి ప్రాణాన్ని కాపాడింది. అమెరికాకి చెందిన ఓ చిన్నారికి రెండేళ్ళ వయసు వచ్చేసరికి ఆమె గుండెలో వున్న పెద్ద లోపం బయటపడింది. గుండెకు వుండే రెండు కవాటాల మధ్య చాలా లోపాలు వున్నాయి. ఆ లోపాలతో ఆ చిన్నారి ప్రాణాపాయంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో గుండె రెండు కవాటాల మధ్య అమర్చడానికి అవసరమైన గుండెలోని ఆ ప్రదేశం నమూనాను డాక్టర్లు 3డి ప్రింటర్‌కి అందించారు. అంతే 3డి ప్రింటర్ ఎంచక్కా పాప గుండె లోపలి భాగాన్ని ప్రింట్ చేసి ఇచ్చేసింది. గతేడాది మొదట్లో గుండెలోని ఆ భాగాన్ని ఆపరేషన్ చేసి అమర్చడంతో ఆ పాపకు కొత్త జీవితం లభించింది. ఈ ఘనత తమది కాదని... 3డి ప్రింటింగ్ టెక్నాలజీదేనని డాక్టర్లు కూడా అంటున్నారు.

(తలలో నీరు చేరడం) అనే సమస్య బారిన పడిన ఓ మూడేళ్ల బాలికకు వారు 3డి ప్రింటెడ్ లోహపు పుర్రెను మార్పిడి చేశారు. ఈ ప్రక్రియ ప్రపంచంలో ఇదే మొట్టమొదటిది. చైనాలోని హునాన్ రాష్ట్రంలో గల సెకండ్ పీపుల్స్ హాస్పిటల్‌లో 2015, జూలై 15 బుధవారం జరిగిన ఈ విప్లవాత్మక శస్త్రచికిత్సను నిర్వహించారు. హునాన్ రాష్ట్రానికి చెందిన మూడేళ్ల బాలిక హాన్‌హాన్‌కు పుట్టుకతోనే హైడ్రోసెఫలస్ సమస్య వచ్చింది. ఫలితంగా తలలో నీరు చేరి క్రమంగా ఉబ్బిపోవడం మొదలైంది. మూడేళ్ళు వచ్చేసరికి పాప బరువు 32 కిలోలకు చేరితే, అందులో తల బరువే 20కిలోలు. తల విపరీతంగా ఉబ్బిపోవడంతో నేత్రనాడిపై ఒత్తిడి పెరిగి కంటి చూపు పోయింది. మెదడుకు రక్త సరఫరా కూడా తగ్గింది. చిన్నారిని పరీక్షించిన వైద్యులు 3డి ప్రింటెడ్ పుర్రెను అమర్చడం ద్వారా ప్రాణాలు కాపాడాలని నిర్ణయించారు. ఈ ఆపరేషన్‌కు 17 గంటలు పట్టింది. తొలుత హాన్‌హాన్ పుర్రె పైభాగాన్ని సీటీస్కాన్ చేసి, 3డి రూపాన్ని డిజైన్ చేశారు. డిజైన్ మేరకు టైటానియం లోహ మిశ్రమంతో 3డీ ప్రింటర్ ద్వారా పుర్రెను 3భాగాలుగా ముద్రించారు. తర్వాత బాలిక తలపై చర్మాన్ని, పుర్రె పైభాగాన్ని తొలగించి, అదనపు నీటిని మొత్తం తీసేశారు. అనంతరం మెదడును సరిగ్గా ఉంచి, దానిపై 3డీ ప్రింటెడ్ పుర్రె ఇంప్లాంట్లను కలిపి అమర్చి, తల చర్మాన్ని అలాగే ఉంచి కుట్లు వేశారు. కొన్నేళ్లలో ఆమె తలలో అమర్చిన ప్రస్తుత ఇంప్లాంట్ల మీదుగా అసలైన పుర్రె ఎముక పెరిగి కొత్త పుర్రె తయారవుతుందని వెల్లడించారు. కాగా, మొత్తం చికిత్స పూర్తయ్యేసరికి రూ. 40-50 లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు చెపుతున్నారు.

**3డి ముఖం**

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన

వ్యక్తికి ఇంగ్లాండ్‌కు చెందిన వైద్యులు 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో కొత్త ముఖాన్ని అమర్చారు. వైద్యశాస్త్ర చరిత్రలో ఒక వ్యక్తికి 3డి టెక్నాలజీ ద్వారా కొత్త ముఖాన్ని అమర్చడం ఇదే తొలిసారి. ఇంగ్లాండ్‌కు చెందిన స్టీఫెన్ పవర్ (29) గతేడాది రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో అతడి ముఖం తీవ్రంగా దెబ్బతినడమేకాక... దవడ ఎముక పూర్తిగా విరగడంతో నాలుగు నెలల పాటు ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకున్నాడు. ఈ నేపథ్యంలో మెరిస్టన్ ఆసుపత్రికి చెందిన వైద్యుల బృందం స్టీఫెన్ ముఖానికి ఎనిమిది గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించి, విజయవంతంగా అతడి పూర్వపు రూపాన్ని తీసుకొచ్చారు. అయితే శస్త్రచికిత్సకు ముందు వైద్యుల బృందం స్టీఫెన్ తొలిరూపాన్ని సిటి స్కాన్ తీసి, 3డి మోడల్ ముఖాన్ని రూపొందించారు. తర్వాత దాన్ని ప్రింట్ తీసి సర్జరీతో స్టీఫెన్‌కు తొలిరూపం వచ్చేలా చేశారు. టైటానియంతో తయారైన ఈ 3డి ప్రింటింగ్ మోడల్‌ను బెల్జియం నుంచి తెప్పించినట్లు డాక్టర్లు తెలిపారు.

త్రిడి ప్రింటింగ్ చాచిన స్నేహ హస్తం కారణంగా...వైద్య ఆరోగ్య సమస్యల నుంచి బైటపడి సాధారణ జీవితాలు గడిపే వారెందరి గురించో తెలుసుకున్నాం. అందుకే... సాంకేతిక విజ్ఞానం మరింతగా వెల్లివిరియాలి. ఆ విజ్ఞానం మానవ వికాసానికి తోడ్పడాలి. ✦

## తలకప్ప

**త**లకప్ప ఆకారంలో ఉండే 3డి ముద్రిత వైద్య పరికరం క్యాన్సర్ల నిర్ధారణను మెరుగు పరుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరికరం శరీరం లోపల జీర్ణవ్యవస్థలో పలురకాల క్యాన్సర్లను గుర్తించడంలో తోడ్పడుతుందనీ, లోపలి విశేషాలపై తీగసాయం లేకుండానే వీడియోలు పంపుతుందని పేర్కొన్నారు. తలకప్ప ప్రేరణతో రూపొందించిన ట్యాడ్‌పోల్ ఎండోస్కోప్ (టీఈ)గా పిలిచే ఈ కొత్త పరికరాన్ని రోగి మింగాల్సి ఉంటుంది. సూక్ష్మ రోబో చేపలా, తలకప్పలా ఈదుతూ వెళ్తుంది. వైద్యులు రిమోట్ సాయంతో దీనిని జీర్ణాశయంలో అటూ ఇటూ కదిలించవచ్చు. సమగ్రమైన చిత్రాల్ని తీయడంతోపాటు, అవసరమైన చోటికి నిక్కచ్చిగా చేరుతుంది. జీర్ణకోశ మార్గం క్యాన్సర్లను గుర్తించడంలో తోడ్పడుతుంది. చైనీస్ యూనివర్సిటీ హాంకాంగ్ పరిశోధకులు దీనిని రూపొందించారు.

బౌద్ధారామం గోడపై వరల్డ్ ట్రేడ్ భవనాలు కూలిన సన్నివేశం. మ్యాట్రిక్స్, కుంగ్ ఫూ పాండాల పోరాట చిత్రాలు. స్పేస్ షిప్‌లు, కిన్నెర వాహనాల చక్కర్లు. ప్రాచీనత ఉట్టిపడే ఉబుసాటో, ఆధునికత మిడిసిపడే గేలరీలు. థాయ్‌ల్యాండ్‌లోని చియాంగ్ రైలో ఉన్న వాట్ రోంగ్ ఖున్ బౌద్ధ ధామం (శ్వేత క్షేత్రం)లో సందర్శకులను అతిశయంలో పడేసే వైరుధ్యాలు, వైవిధ్యాలు. బుద్ధుని బోధనల్ని సర్రియల్ శైలిలో నేటి ప్రపంచ విష యాలకు అన్వయిస్తూ సాగిన దీని పనితనం మిగతా బౌద్ధ ధామాలకు పూర్తిగా భిన్నం.

# శ్వేత బౌద్ధాలయం

థాయ్‌ల్యాండ్ ఆలయ నిర్మాణ శైలికి ప్రపంచవ్యాప్త ప్రత్యేక గుర్తింపు ఉంది. మరీ ముఖ్యంగా ఉత్తర థాయ్ కళకు ముగ్ధులు కానీ కళా పిపాసులు ఉండరు. మూడు పైకప్పులుగా సాగే ప్రధాన భవన నిర్మాణం ప్రాచీనతను కొలువు దీరుస్తుంది. నాగ పడగ, మెలికలను పోలిన ఆకృతులు అదనపు ఆకర్షణ. ప్రపంచవ్యాప్తంగా తన ముద్రను ఆలయ నిర్మాణాలతో వేసిన థాయ్‌ల్యాండ్ సొంత భూమిలోనే 33 వేలకు పైగా సాంప్రదాయక కట్టడాలున్నాయి. పర్యాటక ధామంగా ఆ దేశం విలసిల్లడానికి ఓ రకంగా ఈ బౌద్ధ క్షేత్రాలు కారణం. ఈ పురాతన కళకు సంప్రదాయ సొబగులతో పాటు కాంటెంపరరీ నిజవాదాన్ని జోడించినదే శ్వేత క్షేత్రం. 9 కట్టడాలుగా 6.4 ఎకరాల్లో నిర్మితమైన ఈ బౌద్ధ ధామం తెల్లదనంలోని స్వచ్ఛతకు ప్రతీక. ఒక గర్భమండలం, ధ్యానమందిరం, భిక్షువుల ఆరామం,

విద్యావేదిక, కళా మంటపం ప్రధానమైనవి. మేఘం వాలినట్టుండే ఈ క్షేత్రం తెలుపుదనానికి పాలరాయి కాకుండా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, బెల్జియం అద్దాలతో నగిషీ దిద్దడంతో ఈ కట్టడాలు ధగధగలాడిపోతుంటాయి. ఉబుసొటో (గర్భగుడి)కి చేరే మార్గం, ప్రాంగణాలు, పరిసరాలు అన్నీ ఏదో ఒక బౌద్ధ విశ్వాసాన్ని రూపుదిద్దుతాయి. అదీ సరికొత్త శైలిలో. స్వర్గం-నరకం, మంచి-చెడు, బుద్ధి-దేహం వంటి వైరుధ్యాల మధ్య భేదాల్ని చాలా వైవిధ్యంగా ఆకృతుల ద్వారా, శిల్పాల ద్వారా అర్థం చెప్పడం బాగుంది. చిన్నారులు సైతం విషయమేంటో తెలుసుకునేలా వారి ఊహలు విహరించేలా ఎన్నో భావరూపాలు చిత్రించారు.

జనన మరణ చక్రాలను దాటితేనే స్వర్గ ప్రవేశానికి అర్హత అని చెబుతున్నట్టు ఉండే పునర్జన్మల వంతెన నిర్మించారు. భౌతిక విషయాలపై ఉండే ఆకర్షణ, లోభత్వం, కోరిక, కాముకత, దుర్భిక్షం, కల్లోలానికి గుర్తుగా అథోలోకం నుంచి వందలాది చేతులు అర్థిస్తున్నట్టుగా ఓ సన్నివేశాన్ని వంతెన కిందుగా రూపొందించారు. దాని పక్కనే చిన్న నీటి గుండం. ధూమంలా ఎగసే ఫౌంటెయిన్‌లకూ కోరికలతో ఎగజిమ్మే మనసుకూ పోలిక. అక్కడ నుంచి స్వర్గ ద్వారానికి తోవ. ఇక్కడ సాదరంగా ఆహ్వానించే ద్వార పాలకులు కనిపించరు. ఆయుధాలతో హుంకరించే కిన్నెరులు, రాక్షసులు అడ్డు నిలుస్తారు. దాన్ని దాటేస్తూ ముందుకు సాగేది రెండు నాగుల మధ్య నుంచి. తీరా ద్వారం చేరగానే రాహు, మృత్యు విగ్రహాలు మన మంచి చెడులను పరికిస్తున్నట్టుగా ఉంటాయి. ప్రతి విగ్రహం, ఆకృతి చూపు తిప్పుకోనివ్వవు. కొన్ని భీతిగొలిపేలా ఉంటాయి. కొన్ని భయాన్ని కూడా కళగా కళ్లకద్దుకున్నట్టు ఉంటాయి. ఆ ఒక్క అడుగు దాటేస్తే ప్రశాంతంగా కనిపించే బుద్ధుని రూపాలు ప్రాంగణమంతా ఉంటాయి. గర్భమందిరంలోకి అడుగు పెట్టగానే అప్పటివరకు ఉన్న ప్రాచీన కళా వైభవం నుంచి ఒక్కసారిగా మోడ్రన్ సర్రియలిస్ట్ కళాలోకంలోకి

జారినట్టు అవుతుంది. ఏ బౌద్ధారామంలోను కనిపించని, కనీసం ఊహించని పాత్రలు అక్కడ గోడలపై పెయింటింగ్‌ల రూపంలో ప్రత్యక్షమవుతాయి. సాధారణంగా బుద్ధుని చరిత్ర, జాతక కథలతో నిండిపోయే అంతర్భాగాలు ఇక్కడ మాత్రం కామిక్ హీరోలు, కార్టూన్ పాత్రలు దుష్టత్వంపై పోరాడుతున్నట్టు కనిపిస్తాయి. ప్రపంచ గతిని మార్చేసిన ఘటనల తీరు విశ్లేషణాత్మకంగా చిత్రించారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ కూలడం, ఉగ్రవాదం ప్రపంచమంతా విస్తరించడం, దానిపై యుద్ధం పేరిట ఆయుధ వ్యాపార ఆకృత్యాలు ఇలా ఎన్నో విషయాలపై సందర్శకులను ఎడ్యుకేట్ చేస్తున్నట్టు ఉంటుంది. మానవత, ప్రపంచ శాంతి, నేటి సమాజ తీరుతెన్నులు, వస్తు వ్యామోహం, వెర్రితలలు వేస్తున్న నయా కోరికలు, మనుషుల్లోని పైశాచికత్వం, అనేక వాదాల్లో కొట్టుమిట్టాడుతున్న సగటు జీవి కష్టాలు, నిత్య సవాళ్లు వంటి వాటిని సర్రియల్ ఆర్ట్ సాయంతో తీర్చిదిద్దారు. చెప్పేవి భారమైన, విషాదకరమైన విషయాలే అయినా చక్కటి కళాఖండాలుగా మైమరిపిస్తాయి. ఎదురుగా బుద్ధుని శ్వేత, సువర్ణ విగ్రహాలు కొలువై ఉంటాయి. గర్భగుడి దాటి బయటకు వస్తే ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు సంబంధించిన రెండు స్వర్ణపు స్తంభాలు ఎదురవుతాయి. బంగారు రంగు కోరికకు ఉత్ప్రేరకం. అందుకే మందిరమంతా స్వచ్ఛమైన శ్వేత వర్ణంలో బుద్ధి వికాసాన్ని ప్రతిబింబిస్తూ ధగధగలాడుతుంటే ఈ స్తంభాలు కోరిక జనించేలా బంగారు ఛాయలో లొంగదీసుకునేలా కనిపిస్తాయి. ఇవే కాదు ఇక్కడ టాయ్‌లెట్ రూం కూడా స్వర్ణ కాంతులతో ఏదో ప్రత్యేక భవనంలా కనిపిస్తుంది. హైవేకు పక్కగా ఉండే ఈ ఆలయం దగ్గరి మార్గంలో ట్రాఫిక్ కోన్‌లు కూడా కపాలాలు, కిన్నెర ముఖాలతో కొత్తగా అనిపిస్తాయి. ఒక్కడున్నాడు వినడానికే నమ్మశక్యంగా లేని బౌద్ధ మందిరానికి సృజన చేయడమే కాదు దాని నిర్మాణ భారాన్ని భుజానికెత్తుకుంది అంతర్జాతీయ విజువల్ ఆర్టిస్ట్ అయిన చలేర్మ్‌చాయ్ కోసిత్‌పిపాట్. 1997లో ప్రారంభించిన దీని నిర్మాణంలో ఒక్క పెయింటింగ్‌కే 16 ఏళ్ల సమయం పట్టింది. ఈ తరహా సర్రియల్ బౌద్ధధామాన్ని 1982లోనే ఆయన బ్రిటన్‌లోని వింబుల్డన్‌లో వాట్ బుద్ధపదిపగా నిర్మించాడు. అప్పట్లో ఇదో వివాదమైంది. సొంత దేశంలోను పలు విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ తీరా ఆ క్షేత్రాన్ని దర్శించాక వారి ఆలోచనలు, భయాలన్నీ వీడిపోయాయి. బుద్ధుడి బోధనలు ఈ కాలానికి సరిగ్గా అన్వయించాడంటూ భిక్షువులు సైతం అండగా నిలిచారు. అలా థాయ్‌ల్యాండ్‌లోను ఈ తరహా నిర్మాణానికి బీజం పడింది. సుమారు 60

మంది వలంటీర్ల సాయంతో ప్రభుత్వం నుంచి ఏ ఆసరా లేకుండా ఆర్థిక భారాన్నంతా భరిస్తూ చలేర్మ్‌చాయ్ ఈ ప్రపంచ వారసత్వం అన్నదగ్గ కట్టడాన్ని అందించాడు. కానీ, రెండేళ్ల క్రితం మే 5న లావో మాయి కేంద్రంగా వచ్చిన భూకంపం వల్ల ఈ శ్వేత క్షేత్రం దెబ్బతింది. ఎన్నో ఏళ్ల కష్టం తలకిందులయ్యేసరికి ఒకింత భావోద్వేగానికి గురైన చలేర్మ్‌చాయ్ తన జీవితకాలంలో మళ్లీ దాన్ని పునరుద్ధరించే అవకాశమే లేదని చెప్పాడు. ఆ కట్టడాన్ని కళ్లారా చూసిన వాళ్లు, దాని విశేషాలు విన్నవాళ్లు తర్వాతి రోజుకే వేలాది వినతులు పెట్టుకోవడంతో మనసు మార్చుకుని పెద్ద ఎత్తున విజువల్ ఆర్టిస్ట్‌ల సహాయంతో దాన్ని రెండేళ్లలో తిరిగి పూర్వవైభవానికి తెస్తానని చెప్పాడు. అప్పటికి ఆయనకు 60 ఏళ్లు. రాత్రిపగళ్లు విరామం లేకుండా ఎక్కడా ఇసుమంత తేడా రాకుండా పూర్తి ఒరిజనల్ రూపంలోకి తెచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికి చాలా వరకు పనులు పూర్తయ్యాయి. తిరిగి సందర్శకులను అనుమతిస్తున్నారు. చియాంగ్ రైలోనే నలుపు క్షేత్రం కూడా ఉంది. కానీ ఇది ఓ మ్యూజియం. జంతువుల తలలు, కొండచిలువల చర్మాలు, ఎక్కడ పడితే అక్కడ కనిపించే ఎముకలు, అస్థిపంజరాలతో భయానికి చిరునామాగా ఉంటుంది. దోవ కూడా దట్టమైన, ఎత్తైన వృక్షాల గుండా సాగుతుంది. భవనాలు కూడా అక్కడక్కడ చెల్లా చెదురుగా ఉన్నట్టు ఓ హారర్ స్టోరీలోని ప్రాంతంలా తోస్తుంది. శ్వేత క్షేత్రానికి ఇక్కడి వాతావరణానికి పూర్తిగా భిన్నం. మరో ప్రఖ్యాత విజువల్ ఆర్టిస్ట్ తవాన్ డుచానె దీని రూపకర్త.

**-జే ఎస్పీ**

# వెండి తెర అత్తమ్మ

**ఏ ప్రపంచంలో వున్నా అత్తగార్లందరి మీదా అపవాదులు రావడానికి ప్రధాన కారణం సూర్యకాంతం అంటే అతిశయోక్తి కాదు. ఆమె కళ్ళల్లో చంద్రనిప్పులు చెరిగించగలదు. పున్నమి వెన్నెలలు పూయించగలదు. మాటల తూటాలు పేల్చగలదు. వెన్న ముద్దల్లా కరిగించగలదు. అందరూ పాత్ర ప్రమాణాన్ని చూసి భయపడతారు. పాత్రలు ఈమె ప్రతిభా పాటవాల్ని చూసి లొంగిపోతాయి. ఆమె తెరమీదుంటే ఆమె చెణుకులకి ఎంతటి నటుడైనా ఖంగు తినాల్సిందే! అగ్ర నటులిద్దరూ ముద్దుగా 'అక్కా' అని పిలుచుకునే నటి... వెండి తెర అత్తమ్మ ... సూర్యకాంతమ్మ! .**

**ఇమంది రామారావు**
**9010133844**

తూర్పు గోదావరి జిల్లా కాకినాడ దగ్గరున్న వెంకటకృష్ణరామపురంలో 1924 అక్టోబరు 28న తన తల్లిదండ్రుల 14 వ సంతానంగా జన్మించింది. ఆరేళ్ల వయసు నుంచీ గానం, నాట్యం నేర్చుకోవడం మొదలు పెట్టింది. హిందీ సినిమా వాల్‌పోస్టర్లు చూసి పగటి కలలు కనేది. చిన్నప్పటి నుంచీ సినిమాల్లో నటించాలన్న కోరిక బలంగా వుండటం వలన తల్లిదండ్రులతో చెప్పకుండా చెన్నపట్నం వెళ్లింది.

చెన్నపట్నం అయితే చెప్పా పెట్టకుండా వచ్చేసింది గాని అక్కడ ఆదరించే దిక్కేది? పరిచయంలేని మనుషులు. పరిచయం లేని భాష అప్పట్లో జెమినీ స్టూడియోవాళ్లు నిర్మిస్తున్న 'చంద్రలేఖ'లో ఒక డాన్సరుగా అవకాశం వచ్చింది. ఆమెకు నటిగా పారితోషికం 65 రూపాయలు మాత్రమే ఇచ్చారు. ఆ రోజుల్లోనే సూర్యకాంతమ్మ నిర్మొహమాటంగా తన అసంతృప్తిని వ్యక్తం చేసే సరికి ఆ పారితోషికాన్ని 75 రూపాయలకు పెంచారు. తర్వాత 'రుక్మాంగధ' చిత్రంలో ఒక మూగ వేషం వేసి చిన్నాచితకా వేషాల్లో కనిపించినా అప్పట్లో ప్రముఖ నటి లీలా కుమారి సాయంతో నారదనారది చిత్రంలో సహాయ నటి (ప్రధాన పాత్రలో) అవకాశం వచ్చింది. అదే ఆమె జీవితంలో సరికొత్త మజిలీ. తన మనసెప్పుడూ బొంబాయి హిందీ పరిశ్రమ చుట్టూ తిరుగుతూ వుండేది. ఆ చిత్రాలయితే భారీగా వుంటాయి. హిందీలో నటిస్తే భారతదేశమంతా తెలుస్తుందన్న ఆశ. 'గృహప్రవేశం' చిత్రంలో సహాయ నటిగా మంచి అవకాశం వచ్చింది. కొంచెం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోంది. ఇక బొంబాయి వెళ్లి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని సిద్ధమయ్యింది. ఇంతలో ఊహించని ప్రమాదం. కారు యాక్సిడెంట్ ఆమె కొంప ముంచింది. ఆమెకు హిందీ చిత్రంలో హీరోయిన్ అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. ఆమె కోలుకున్న తర్వాత ఆమె ఆస్పత్రిలో ఉన్న సమయంలో ఓ మార్పు వచ్చింది. జీవితం చాలా విలువైనది. దాన్ని సద్వినియోగం చేసుకోవడం మన చేతుల్లో వుంది అని తెలుసుకుంది. మొట్టమొదటిసారిగా 'సంసారం' చిత్రంలో గయ్యాళి పాత్రలో కనిపించింది. అంతే! ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు.

రేలంగితో కలిసి నటించడం అదృష్టమనే మాటలు తరచూ సూర్యకాంతం అంటుండేది. ఆ రోజుల్లో కాకినాడ నుండే ఎక్కువ మంది నటీనటులూ, సాంకేతిక నిపుణులూ దిగుమతయ్యారు. దర్శకులు సి. పుల్లయ్య, నటుడు రేలంగి వెంకట్రామయ్య కాకినాడ వాస్తవ్యులనే సరికి అభిమానం చూపేవారు. పైగా రేలంగి ఆ రోజుల్లో అందరికీ తలలో నాలుకలాగా వుండేవాడు. రేలంగి ఒక మాట చెబితే దాన్ని గౌరవించి అమలు పరిచేవారు. రేలంగి తర్వాత రమణారెడ్డి, యస్వీ రంగారావుతో జంటగా నటించింది సూర్యకాంతం. ఏదయినా సినిమా మొదలు పెడుతుంటే డిస్ట్రిబ్యూటర్లు మొట్టమొదటి సారిగా అడిగే ప్రశ్న ఈ సినిమాలో సూర్యకాంతమ్మ వుంది కదా? అంత నమ్మకం వారికి. సూర్యకాంతమ్మ వుంటే ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నట్టే. మినిమమ్ గ్యారంటీ వుంటుందని పంపిణీదార్లు ఆశపడేవారు.



సావిత్రి, కన్నాంబతో...

**మరపురాని చిత్రాలు**

అన్ని మరపురాని చిత్రాలే. ఎన్నని చెప్పగలం? అందులో కొన్ని చిత్రాల్ని ఉదహరించడం మాత్రం చెయ్యగలం. సంసారం, పెళ్ళిచేసి చూడు, బ్రతుకుతెరువు, దొంగ రాముడు, చరణదాసి, భాగ్యరేఖ, మాయాబజార్, తోడికోడళ్ళు, దొంగల్లో దొర, అప్పు చేసి పప్పుకూడు, మాంగల్య బలం, జయభేరి, శాంతి నివాసం, ఇద్దరు మిత్రులు, పెళ్ళికాని పిల్లలు, భార్యాభర్తలు, వాగ్దానం, వెలుగునీడలు, కలిసివుంటే కలదు సుఖం, మంచి మనసులు, రక్తసంబంధం, సిరిసంపదలు, గుండమ్మకథ, చదువుకున్న అమ్మాయిలు, కృష్ణ, మూగ మనసులు, డాక్టరు చక్రవర్తి, ఆస్తిపరులు, కన్నె మనసులు, బ్రహ్మచారి, సుఖదు:ఖాలు,

ఉమ్మడి కుటుంబం, అత్తగారు – కొత్త కోడలు, బుద్ధిమంతుడు, ఆత్మీయులు, బాలరాజు కథ, దసరా బుల్లోడు, కొడుకు కోడలు, అందాల రాముడు, ముత్యాల ముగ్గు, సెక్రటరీ, గోరంత దీపం, కార్తీక దీపం, వియ్యాలవారి కయ్యాలు, చుట్టాలున్నారు జాగ్రత్త, పెళ్ళి చూపులు, బంధువులున్నారు జాగ్రత్త, చివరి చిత్రం వన్ బై టూ. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే! అయిదు వందల పైచిలుకు చిత్రాల్లో నటించిన సూర్యాకాంతం 1950 నుండి 1970 వరకు ఆమె లేని చిత్రం లేదంటే అతిశయోక్తి కాదేమో!

**భయపడిన రెండు చిత్రాలు**

అదేమిటి?




సూర్యాకాంతమ్మ భయపడటమా? అని ఆలోచనలో పడ్డారు కదూ? అవును. వాహిని వారి 'గుండమ్మ కథ' చిత్రంలో ప్రధాన పాత్రకి ఎంపిక చేసినప్పుడు.. నాగిరెడ్డి, చక్రపాణిలతో చెప్పే సాహసం చెయ్యలేక చిత్రదర్శకుడు కమలాకర కామేశ్వరరావుతో "అగ్రనటులిద్దరుంటుండగా నా పేరుతో సినిమా రావడం వారి అభిమానులకు బావుండదు. ఈ సినిమా వరకు నన్ను వదిలేయండి!" అని అభ్యర్థించింది. అది నిర్మాతలకు చెప్పడంతో వారు సూర్యకాంతమ్మను పిలిపించి "అమ్మా! నీ సంస్కారం గొప్పది. మేం తీస్తున్నది సినిమా. మీరు చేస్తున్నవి పాత్రలు. నటుల మీద ప్రేమాభిమానాలు గుండెల్లో వుండాలి గాని, పాత్రలకు అంటగట్ట కూడదు. మరింకేం ఆలోచించకుండా నటించండి." అని తెగేసి చెప్పారు నాగిరెడ్డి, చక్రపాణి. అలాగే అగ్రనటులిద్దరూ 'అక్కగా' ఆదరించి ప్రోత్సహించారు. ఆ సినిమా ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. రెండవ చిత్రం 'రక్తసంబంధం'. అందులో సావిత్రి నటనకి కరిగిపోయింది. ఆమె సెట్లో నటిస్తుండగా కళ్ళు వాచిపోయేలా ఏడ్చి మూడవుట్ అయ్యింది. చివరికి దర్శకుడితో "అయ్యా! నేను నటించలేకపోతున్నాను. నా బిడ్డ సావిత్రి డైలాగులు చెబుతుంటే ఎందుకో కడుపు తరుక్కుపోతోంది. సావిత్రి డైలాగు చెప్పిన తరువాత నా బుర్ర పనిచేయ్యడం మానేసింది. నేను అశక్తురాలిని!" అని వేడుకుంది. తర్వాత సావిత్రి, యన్.టి.ఆర్‌లు నచ్చజెప్పి నటింపచేశారు. అంతటి బాధలోనూ పాత్రకి జీవం పోయడం సూర్యకాంతానికే చెల్లింది.

**వ్యక్తిగత జీవితం**

1950లో అప్పటి హైకోర్టు జడ్జి పెద్దిభొట్ల చలపతిరావుని వివాహమాడింది. ఆమె భోళా మనిషే గానీ అంత సులువుగా ఎవర్నీ నమ్మేది కాదు. తను కమ్మగా వండేది. పది మందికీ పెట్టేది. సూర్యకాంతమ్మ సెట్లో వుందంటే సందడే సందడి. అందరికీ కొసరి కొసరి కడుపు నిండా తినిపించేది. పెద్ద కారియర్లు రెండు తీసుకొచ్చి పదిమందీ తిన్న తర్వాతే తను తినేది. తీరిక సమయంలో పేకాడ్డం తనకి సరదా. పురచేతివాటం. ఎప్పుడూ గెలుపు గుర్రమే! స్టూడియోలో పేద సాదలుండేవారు. వారి పెళ్లిళ్ళకు తాళి బొట్టూ, బట్టలూ విధిగా పెట్టేది. తన మనసుకి నచ్చితే ఎంతటి సహాయం చెయ్యడానికైనా వెనుకాడేది కాదు. చిన్న వయసులోనే వైధవ్యాన్ని అనుభవించడం వలన ఎవరు నమస్కరించినా పది కాలాలు పిల్లాపాపలతో దీర్ఘసుమంగళిగా వుండమ్మా అని ఆశీర్వదించేది.

**అవార్డులూ రివార్డులూ**

సూర్యకాంతమ్మ జీవితం ఇంటా బయటా నవ్వుల నావలా సాగిపోయింది. ఆమె మాట కరకుదనం వున్నా మనసు వెన్నపూస. ఆమె నటనకి దాసోహం అనని నటీనటుల్లేరు. గయ్యాళికి పర్యాయ పదంగా నిలిచిపోయింది సూర్యకాంతమ్మ. "లక్షణమైన పేరు సూర్యకాంతమ్మ. ఈ పేరు పెట్టుకోడానికి తెలుగు ప్రజలు భయపడిపోతున్నారు. అంత గొప్ప నటనమ్మా నీది" అని గుమ్మడి అనేవారు. సహజ నట కళా శిరోమణి, హాస్య నట శిరోమణి, బహుముఖ నటనా ప్రవీణ, రంగస్థల శిరోమణి ఇత్యాది బిరుదులు వరించినా బిరుదులకు అతీతమైంది ఆమె నటన. సూర్యకాంతమ్మకి సాటి, పోటీ ఎవరూ లేరు. దశాబ్దం క్రితం ఆమె చనిపోయినా సొగసరి కోడళ్లు గడసరి అత్తల్ని ఆమె పేరుతోనే ఆటపట్టిస్తుంటారు.

✦

# బాడీ బిల్డర్ బార్బీ....

బాడీ బిల్డింగ్ అంటే ఎంత కష్టమైన విషయమో మనందరికీ తెలుసు. క్రమం తప్పకుండా ప్రతిరోజూ కఠినమైన వ్యాయామాలు చేయాల్సి వుంటుంది. అలాంటిది చేతులు లేని బార్బీ ఆ అంశాన్ని ఎంచుకుంటే ఇంకెంత కష్టపడాల్సి వుంటుందో తెలీంది కాదు. మొదట ఆమె అందుకవసరమైన శిక్షణ తీసుకోదల్చినప్పుడు చుట్టుపక్కల వారినుంచి ఎగతాళితో కూడిన నవ్వులు...గుసగుసలు...వినిపించాయి. తన ప్రయత్నం నుంచి వెనక్కి లాగే ప్రయత్నం కూడా చేశారు. 'నువ్వా...బాడీ బిల్డింగా? అసాధ్యం!' అని కూడా వెక్కిరించారు. ఆ మాటలు...నవ్వులు...ఆమెలో కసిని రగిల్చాయి. సాధించి తీరాలన్న పట్టుదలను వెయ్యి రెట్లు పెంచాయి. అందుకే చీదరించుకున్నా...అసాధ్యమన్నా... వెంటబడి మరీ ట్రైనర్‌ను ఒప్పించి... శిక్షణకు చేరింది. కాళ్లతోనే బరువులు ఎత్తడం అభ్యసించింది. నృత్యం కూడా నేర్చుకుంది. ఈత సంగతి చెప్పేదేముంది! చేతులు లేకపోయినా తనకు సంబంధించిన అన్ని పనులూ చేసేస్తుంది. కంప్యూటర్ మీద పని చేస్తుంది. కాలేజీలో చదువుకుంది. 2000 సంవత్సరం నుంచి బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనారంభించింది. అన్ని అవయవాలూ ఆరోగ్యంగా వున్న వారితో సైతం పోటీ పడి సునాయాసంగా విజయం సాధించింది.

ఇన్ని విజయాలతో ఎందరికో స్ఫూర్తినిస్తోన్న బార్బీ జీవితంలో ఓ చేదు ఘటన జరిగింది. అప్పుడు బార్బీకి రెండున్నరేళ్లు. చలాకీగా ఆడుతూ పాడుతూ నవ్వుతూ నవ్విస్తుండేది. ఓరోజు అలా ఆడుకుంటూనే ట్రాన్స్‌ఫార్మర్ మీద ఎక్కి రెండు చేతులతో కరెంటు వైర్లు పట్టుకుంది.

స్ఫూర్తి

**సాధించాలన్న తపన, పట్టుదల, కృషి వుండాలే గానీ... వైకల్యం వాటి ముందు వంగి సలాం చేయదూ! విజయం వచ్చి ఒళ్లో వాలదూ!! నలభయ్యేళ్ల బార్బీ థామస్ ఆ రెండు వాక్యాలకు నిలువెత్తు రూపం. రెండు చేతులు లేకపోతేనేం! బాడీ బిల్డర్‌గా గత దశాబ్ద కాలంగా విజయ పతాకం ఎగురవేస్తూ ఎందరికో స్ఫూర్తినిస్తోంది.**

శరీరంలోంచి ప్రసారమైన విద్యుత్తు ఊరుకోదుగా. ఎముకలతో సహా రెండు చేతులను దగ్ధం చేసేసింది. దాంతో వైద్యులామె చేతులను భుజాల వరకు తొలగించారు. కాళ్లకు టెన్నిస్ బూట్లు వుండడంతో కనీసం ప్రాణాలతోనైనా మిగిలింది. ఆ దుర్ఘటన బాగా చిన్నతనంలో జరిగింది కాబట్టే తను అత్యంత సులభంగా వైకల్యాన్ని అధిగమించేందుకు తన శరీరం సహకరించిందంటోంది బార్బీ. అందరూ చేతులతో చేసే పనులను బార్బీ కాళ్లతో చేసేస్తుంది. వంట దగ్గర నుంచి మెయిల్స్ పంపడం, పియానో వాయించడం, కారు నడపడం...అన్నీ కాళ్లతోనే. కాకపోతే మాల్స్‌కు వెళ్లినప్పుడే ఇతరుల సాయం తీసుకోవాల్సి వస్తుంది.

ప్రస్తుతం బార్బీకి ఇద్దరు పిల్లలు. ప్రేమించి పెళ్లి చేసుకుంది. మొదటి పిల్లవాడిని అతనే చూసుకున్నాడు. రెండవ బిడ్డ పుట్టే సరికి వారి మధ్య విభేదాలు చోటు చేసుకుని అతని నుంచి విడిపోయి ఒంటరిగానే పిల్లలను సాకుతోంది. రెండవ వాడు మరీ చిన్నగా వున్నప్పుడు కాళ్లతోనే వాడిని ఒళ్లో పెట్టుకుని ఆడించేది. కాళ్లతోనే పిల్లవాణ్ణి దిండు మీద వుంచి తన పనులు చేసేది. ఇప్పుడు వారికి పదిహేను, పంతొమ్మిదేళ్లుంటాయి. ఓవైపు పిల్లలను చూసుకోవడం, మరోవైపు డాన్సు, సాకర్, ఈత, బాడీ బిల్డింగ్ పోటీలు, దైనందిన సాధన...అన్నీ చేతులు లేకుండానే.

ఇంటి చుట్టుపక్కల ఎక్కడ ఏ చిన్నపాటి ఫంక్షన్ జరిగినా బార్బీ నృత్యం వుండాల్సిందే. హాలీవుడ్ చిత్రాలలో నటించాలన్నది బార్బీ కోరిక. తను రెండవసారి గర్భవతిగా వున్నప్పుడు స్టీవెన్ స్పీల్‌బెర్గ్ నుంచి 'ఎ. ఐ' (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సినిమాలో రోబో పాత్ర కోసం ఆహ్వానం వచ్చిందనీ, అయితే గర్భిణిగా ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయానని చెప్తోంది. అయితే ఇప్పటికైనా హాలీవుడ్‌లో వికలాంగులకు మంచి అవకాశాలున్నాయని, ఎప్పటికైనా సినిమాల్లో నటిస్తానన్న నమ్మకంతో వుంది. అంతే కాదు! తనలాగా వైకల్యం కలిగిన వారు ఆటంకాలను అధిగమించి విజయాలు సాధించేందుకు వీలుగా ఉత్తేజపూరితమైన ప్రసంగాలు కూడా చేస్తుంది. మనసుంటే మార్గం వుంటుందని... కలలు సాకారం చేసుకోవచ్చన్నది బార్బీ మాటే కాదు. బాట కూడా.

✦

# ఆత్మస్థైర్యమే జీవితానికి ఆయుస్సు

నిశ్శబ్దం ఓ సంగీతం
నిశ్శబ్దం ఓ మంచు అల
నిశ్శబ్దం ఓ జీవన గీతం
నిశ్శబ్దంలో ఓ కేక వుంది
సముద్రం నర్మగర్భంగా మూలుగుతోంది

అలకి అలకి మధ్య ఒక వైరుధ్యం
ఆకాశం కడలిని ముద్దాడుతున్న ఓ సృజన
సుడిలో చిక్కుకున్న ఒక చిరు చేప
ఊపిరి ఆడక ఎగిరి దూకింది
మునక ఈత వేస్తున్న చేపలన్నీ
ఆంతరంగికంగా మాట్లాడుకొంటున్నాయి

వేటగానికి అందని ఓ ఆట
పడవ మీదున్న జాలరి వేస్తున్న
ఈల పాటకు తలలూపుతున్న అలలు
చీకటి అలల మీద కాసేపు నిద్రించింది

ఆకాశంలో నక్షత్రాల జాతర
కడలి ఒడ్డున గవ్వల మొలతాడుతో
ఓ బుడ్డోడి చిందుల్లోను ఓ లయ తప్పని శ్రుతి
తడిసిన ఇసుకలో చారిత్రక ముద్రలు
ఒడ్డునే తిరిగి తిరిగి అలసిన ఓ పడవ
ఎన్నో కన్నీటి గాధలు వినిపిస్తుంది
ఆ చెలియలి కట్టపైన ఓ గుడిసె
అందులో ఓ ముదసలి కర్ర లేకుండ
నడుస్తుంది
సముద్రంలో వేటకని వెళ్ళిన కొడుకు మళ్ళీ
తిరిగి రాలేదు
కడలి 'జీవితాన్ని ఇచ్చింది...తీసుకొంది' అని
నిట్టూర్చింది

ఆ చలి మంట చుట్టూ కూర్చున్న
పిల్లల గుంపు మధ్యలో చలిగాచుకొంది
అవును! ముసలితనం కూడా ఓ శైశవమే!
బాల్యాన్ని గుర్తుపెట్టుకోగలదు
భవితవ్యాన్నేం గుర్తుపెట్టుకోగలదు
ఆమె! బొటనవేలుతో తాటి ముంజెను
జుర్రుతుంది
గోరు గుజ్జును తాటి డొప్పను తాకింది

మనుష్యులు లోభులవుతున్నారు
పెదాలు ఆడించి బతుకుతున్నారు
జీవితానికి ఆయువైన స్థైర్యాన్ని
పోగొట్టుకొంటున్నారు
నదులకు ఆనకట్టలు కడుతున్నారు

కోరికలకు హద్దులు లేవు
ఈత బొత్తిగా రాదు
సుడిగుండంలో మునక
అర్ధరాత్రిలో కూడా వారు సందడే
చేస్తున్నారు
సూర్యోదయం వారికి లేదు
ఆ యువకుల ఎముకలు
గుల్లబారుతున్నాయి

వెలుగులో చీకటి బతుకుతోంది
చీకటి వెలుగు కునుకు తీస్తుంది
ఆ పక్షులు ఆ కొలనుపై అడుగులేస్తూ
నడుస్తున్నాయి
ఆత్మ విశ్వాసం వాటి నడకకు ప్రాణం
ఆ పక్షులు గుంపులుగా జీవిస్తున్నాయి
వాటి కన్నుల్లో నక్షత్ర మండలాలున్నాయి
అవి వేటగాడికందనంత ఎత్తుకు
ఎగురుతున్నాయి
ఎల్లలు చెరిపేస్తున్నాయి
ఆకాశంలో మబ్బులను వాహనాలు
చేసుకొంటున్నాయి

ఆ చిలకలు చిగురాకులను మేసి
జీవిత సత్యాలు పలుకుతున్నాయి
ఆ గోరింటాకు చిదిమే కొద్దీ
ఆనందాన్ని చిమ్ముతోంది
ఆ తెల్లవారుజామున మెరిసే
ఒకే ఒక చుక్క దిశా నిర్దేశం చేస్తుంది
కృతజ్ఞత జీవితానికి ఊపిరి సుమా!
ఆ కొండపైకి ఎక్కుతున్న గొర్రె పిక్క
బలంగా వుంది
ఏ మత్తు మందులు లేకుండానే
అది విజేత అవుతోంది
వధకు అందనంత కాలం అది విజేత
మీరు శిధిలమవుతున్న సమాధుల చుట్టు
తిరగకండి
భవిష్యత్తు మీద ఆశ నశిస్తుంది
మీ వాహనానికి మీరే సారథులు కండి!
ఇతరుల వాహనం ఎక్కినంత కాలం
మీ గమ్యం సుదూరమవుతోంది!

అమరావతిలో బుద్ధుని విగ్రహం
తోడు కోసం చూస్తుంది
అంబేద్కర్ తోడుతో ' కరుణ' ను
పండించాలని ఆశిస్తోంది
అవును! కడలి, పక్షి, గొర్రె
మనకు ఆత్మస్థైర్యాన్నియిస్తున్నాయి
బుద్ధుడు, అంబేద్కర్
మనల్ని పునరుజ్జీవింప చేస్తున్నారు
అవి నన్ను నడిపిస్తాయి

మనుష్యులారా! ప్రేమను పెంచుకోండి!
చీకటిని వెలుగును అధ్యయనం చేయండి!
మనస్సును అర్థం చేయండి!
మెదడును పదును పెట్టండి!
విజేతలు కండి!
జ్వలిత జ్వలనంగా నడవండి
ఆత్మస్థైర్యమే జీవితానికి ఆయుస్సు

**డా॥ కత్తి పద్మారావు**
**సెల్ 9849741695**

వింత లోకం

## ఒట్టి కాళ్ల ప్రయాణం...

**కా**ళ్లకు చెప్పుల్లేకుండా నడిచేవారిని చూసి పాశ్చాత్యులు నోరెళ్లబెట్టేస్తారు. అక్కడ బీచుల్లో తప్ప ఇంకెక్కడా కూడా అలా తచ్చాడుతూ కనిపించరు. మంచు ముద్దయ్యే నేల కావొచ్చు, వారి అతి హైజీన్ పిచ్చి కావొచ్చు గానీ వారికి అదో ఆశ్చర్యం. దాన్నే బాగా పెంచేస్తున్నాడు ఉక్రెయిన్‌లోని కీవ్‌కు చెందిన ఆండ్రెజ్ నొవోసియోలొవ్. పదేళ్ల నుంచి సబ్‌జీరో ఉష్ణోగ్రతల్లోను చక్కగా వొట్టికాళ్లతో ఊరంతా తిరిగేస్తున్నాడు. రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌కు చెందిన ఓల్గా గావ్వా అనే వ్యక్తి కూడా ఇలా బేర్‌ఫూట్‌తోనే బయటకు బయలుదేరు తుంటాడని చదివి ఆండ్రెజ్ ఫాలో అవుతు న్నాడు. కొత్తలో ఆండ్రెజ్‌తో కలిసి బయటకు వెళ్లాలంటే కుటుంబ సభ్యులు తెగ ఇబ్బంది పడేవారు. దారిన ఎదురయ్యేవారు చిరాగ్గా చూడటం, బూట్లకు డబ్బులివ్వడం ఇలా చాలానే జరిగాయి. ప్రోగ్రామర్ అయిన ఆండ్రెజ్ కంపెనీలో దీన్ని అడ్డుకునే డ్రెస్ కోడ్ లేకపోవడంతో సరిపోయింది గానీ లేకపోతే... ఉద్యోగం ఊడేది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో గార్డులు చెప్పుల్లేకుండా వస్తే అడ్డుకుంటారని ఓ జత వెంటేసుకెళతాడు. సబ్‌వేలోకి వెళ్లాక తిరిగి విప్పేసి నడుస్తాడు. వారికది వింత. వారికది వింతగా అనిపించడం మనకో వింత.

## మేన్షన్‌లో శిబిరం!

**టె**క్సాక్‌కు చెందిన కుబేరుడు రాన్ స్టర్జియన్‌ది చాలా పెద్ద మనసు. విలాసవంతమైన తన రెండు భవనాలను టోర్నడో బాధితుల సహాయక శిబిరంగా మార్చేశాడు. నెలకు ఒక్క డాలర్ చొప్పున ఇచ్చి మూడు నెలలపాటు వాటిల్లో కుటుంబంతో సహా ఉండొచ్చని అనుమతిచ్చాడు. అమ్మకానికి పెట్టిన ఆ భవంతులు ఖాళీగా ఉండటం కన్నా ఇలా బాధితులకు సహాయం కావడం మంచిదనేది ఆయన ఉద్దేశం. ఒక్కోటి 10 నుంచి 15 కోట్ల విలువ చేసే ఆ భవనాల్లో నాలుగైదు కుటుంబాలు ఉండొచ్చు. ఎక్స్‌ట్రాగా పడివున్న కార్లను ఉచితంగా వాడుకోవచ్చు అని ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశాడు. గతంలో ఇల్లు లేకుండా గడిపిన జీవితం ఇంకా గుర్తుంది కాబోలు. తండ్రి చనిపోయాక వీధిన పడ్డ రాన్ 1978లో సొంత వ్యాపారం పెట్టి పైకి వచ్చాడు.

## రొట్టె విరిగి వజ్రం...

**ఫ్రా**న్స్‌లో ఎపిఫెనీ ఫీస్ట్ డే సంబరాలు అంబరాల్ని అంటాయి. మరి ప్యారిస్, కస్టిన్స్‌ల్లో ఉన్న తమ బేకరీల అమ్మకాల్లో మాత్రం అంత సంబరం లేదని 'డెలిసెస్ డి బెల్లెవిల్లే', 'ఎల్ అమాండైన్' బేకరీ నిర్వాహకులు, దంపతులు అయిన నికోలస్ లెలుట్, జూలీలు తెగ బాధపడిపోయారు. అమ్మకాలు పెంచుకు నేందుకు వజ్రం లాంటి ఐడియా వేశారు. ఫీస్ట్ డే నుంచి తమ బేకరీలోని పేస్ట్రీల్లో రెండు వజ్రాలు దొరికే చాన్స్ మీదే అని ఊదర గొట్టారు. ఇంకేముంది అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. తింటూ పటుక్కున పన్ను విరగ్గొట్టుకునే చాన్సో, బొజ్జలోకి మింగేసే అవకాశమో ఉందని ఎడిబుల్ ఫేక్ వజ్రాలను ఉంచారు. వాటిని గుర్తించి ఇస్తే నిజం వజ్రాలు చేతికందిస్తామని గమనికలో రాసేశారు. ఎవరి రొట్టె విరిగి వజ్రం దొరుకుతుందో మరి.

## క్రెడిట్ రి'కార్డు'

**ఒ**క్క క్రెడిట్ కార్డుతోనే తంటాలు పడలేనివారికి వాల్టర్ కవాన్హా గురించి చెబితే షాక్ తింటారు. ఏకంగా 1497 క్రెడిట్ కార్డులను మెయిన్‌టైన్ చేస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డు కొట్టేశాడు. వాటిని ఉంచే వ్యాలెట్‌పై కూడా గిన్నిస్ రికార్డు నమోదైంది. 250 అడుగుల్లో విస్తరించే అది దాదాపు 20 కేజీల బరువుంటుంది. ఒక్కసారిగా 800 కార్డుల్ని అందులో సర్దొచ్చు. కానీ వాల్టర్ వెంట కొన్నింటినే తీసుకువెళతాడు. మిగతా వాటిని బ్యాంక్ సేఫ్ డిపాజిట్‌లో దాచేస్తాడు. కాలిఫోర్నియాకు చెందిన తన మిత్రురాలు శాంటా క్లారాతో 1960లో ఓ పందెం కాసి మరీ ఇలా వాడుకలో ఉండే క్రెడిట్ కార్డులను సేకరించడం మొదలెట్టాడు. తొలి ఏడాదిలో వాల్టర్ 143, శాంటా 138 కార్డులు పోగేశారు. పందెం గెలిచిన వాల్టర్ అక్కడితో ఆగకుండా అందినకాడికి కార్డులు తీసుకుంటూనే ఉన్నాడు. ఆర్థిక నిపుణుడు అయిన వాల్టర్‌కిపుడు 72 ఏళ్లు. కార్డుల వల్ల పీకల్లోతు అప్పుల్లో మాత్రం కూరుకుపోలేదు.

అతడి సలహా ఏమిటంటే రెండు నెలల్లో కచ్చితంగా తిరిగి చెల్లించేయగలిగినపుడే కార్డుపై ఏదైనా తీసుకోవాలని క్రమశిక్షణ పాటించాలి అంటాడు.

# నవ్వుల్ – పువ్వుల్

## ప్రెజెంటేషన్



"**పె**ళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు నీకు దగ్గిర వాళ్ళే కదా, మరి వారికి ఏం ప్రెజెంట్ చేశావు?" అడిగాడు ఆనంద్
"**పె**ళ్ళి కొడుక్కి కలర్ టి.వి, పెళ్ళి కూతురికి రిమోట్ కంట్రోల్‌ని ప్రెజెంట్ చేశాను" చెప్పాడు వెంకట్రావ్.

---

## ఇల్లు

"**నా**రదుడు ముల్లోకాల్లో సంచరించడానికి కారణం ఏమిటి?" అడిగాడు చరిత్ర మాష్టారు
"**బ్యా**చిలర్‌కు ఇల్లు అద్దెకు ఇవ్వరు కదండి... అందుకు" టపీమని చెప్పాడు శ్రీనివాస్.

---

## టి...

**రాము:** వారంలో టి తో మొదలయ్యే రెండు రోజుల పేర్లు చెప్పు వివేక్.
**వివేక్:** టుడే, టుమారో..

---

## పరీక్ష హాలు

**చింటూ** పరీక్ష హాల్లో కూర్చుని దిక్కులు చూస్తున్నాడు
**టీచర్:** ఏం చింటూ! అలా హైరానా పడుతున్నావ్?
(చింటూ ఏం జవాబు చెప్పకుండా సైలెంట్‌గా కూర్చున్నాడు.)
**టీచర్:** ఏంటీ, పెన్ను మర్చిపోయి వచ్చావా?
(మళ్ళీ సైలెంటే...)
**టీచర్:** ఏంటీ , రోల్ నెంబర్ కానీ మర్చిపోయావా?
**చింటూ:** లేదు మేడమ్. రేపటి పరీక్ష స్లిప్పులు పొరపాటున ఇవాళే తెచ్చేశాను.

---

## బండి



**హరి:** వేగంగా వెళ్లే బైకు చూపించు?
**షాపువాడు:** ఇదిగోండి సార్! పొద్దున ఐదింటికి ఎక్కితే ఐదు నిమిషాల్లో ఆఫీసులో ఉంటారు!
**హరి:** అయితే ఇది నాకొద్దు. అంత పొద్దున్నే ఆఫీసులో నాకేం పని.

---

## చేతి రాత

**టీచర్:** నీ హోమ్ వర్క్ చూశాను. రాత మీ నాన్నగారి హ్యాండ్ రైటింగ్‌లా ఉందేంటి.
**స్టూడెంట్:** మా నాన్న గారి పెన్నుతో హోమ్ వర్క్ చేశాను టీచర్.

---

## ఇట్లు...గుర్రం

**హై**దరాబాదులో జూలో కొత్తగా ఒక గుర్రాన్ని తెచ్చి ఉంచారు. ఎవరైనా చిరుతిళ్ళు పెడతారేమోనని 'దయచేసి ఈ గుర్రానికి చిరుతిళ్ళు పెట్టవద్దు... ఇట్లు జూ యాజమాన్యం' అని అధికారులు ఒక బోర్డు పెడతారు.
**మ**ర్నాడు చూస్తే దానికింద మరో బోర్డు ఉంది..'పైనున్న నోటీసుని ఎవరూ పట్టించుకోనవసరం లేదు. ఇట్లు గుర్రం.'!!

---

## రెండు చక్రాలు

"**నువ్వు** మీ ఆయనతో తగువులాడ్డం మానెయ్యాలి. సంసారమనే రథానికి భార్య భర్తలిద్దరూ రెండు చక్రాల్లాంటి వారు తెలుసా!" అని చెప్పాడు జడ్జి.

"**నిజమే** కావచ్చు... కానీ ఒకటి సైకిలు చక్రం మరొకటి ట్రాక్టరు చక్రం అయితే ఎలా ఉంటుందో మీరే చెప్పండి" అన్నది భార్య దీనంగా....

# బొమ్మల కొలువు

**జంధ్యాల రఘుబాబు**

9849753298

దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ముత్తైదువులు ఎవరికి వారు తమ తమ పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. బొమ్మల కొలువులు,పేరంటాలు, దేవీ అలంకరణలు అదీ రోజుకొక విధంగా తమ శక్తి మేరకు చేస్తున్నారు.

వాతావరణ దృష్ట్యా అయితే దసరా అనిపించటం లేదెవ్వరికీ. గ్రీన్ హవుస్ పుణ్యమా అని ఎండాకాలాన్ని మరిపిస్తోంది. అక్టోబరు మాసం. వర్షాలు లేక చాలా చోట్ల పచ్చగా కళకళలాడాల్సిన పైర్లు పసుపు పచ్చగా వెలవెలబోతున్నాయి. ఆకుపచ్చ పొలాల్లో అరటి చెట్లను ఇతర పంటలను కొన్ని చోట్ల అనాగరికంగా నరికి రాజధానిని నిర్మిస్తున్నారు. ఐనా దసరా అంటే దసరానే అన్నట్లు ఎవరికి వారు ఆ వాతావారణాన్ని తేవటానికి, తెచ్చుకోవటానికి నానా తంటాలు పడుతున్నారు.

సత్యవతి కూడా ఎవ్వరికీ తీసిపోదు. ఆమె ప్రత్యేకమైన మనిషే కాని అందరితోనూ కలిసిపోతుంది. మనిషిగా కొందరికి దూరమున్నట్లు అనిపించినా తన మనసు అందరికీ దగ్గరగా ఉంటుంది. చేసే పనులన్నీ ఇష్టంగా చేయటమే కాకుండా ఇతరులతోనూ అంతే ఇష్టంగా చేయిస్తుంది. బ్యాంకు అధికారిగా ఉద్యోగం చేస్తున్నా సంప్రదాయాలంటే గౌరవమే. అందరితో పాటు తను కలిసిపోతుంది. తన గురించి పరిచయమెందుకంటే ఈ కథకి నాయకురాలు ఆమే కాబట్టి.

కానీ ఈ సారి దసరాకి తన మిత్రురాలు ఉమ ఊర్లో లేకపోవటం సత్యవతికి నిరాశ కలిగిస్తోంది. తనను ఏ విధంగానైనా ఒప్పించి రప్పించాలని గట్టిగా అనుకుంది.

అసలు ఉమతో తనకు ముప్పై ఏళ్ళ స్నేహం, ఇప్పటిది కాదు. చిన్నప్పుడు హైస్కూల్ నుండి నేటి వరకూ కలిసి ఉన్నారు. మనసు పొరల్లో గతం రివైండ్ అవుతోంది సత్యవతికి.

◆◆◆

తను తొమ్మిదో తరగతి చదువుతోంది కర్నూలులోని బి. క్యాంపు గర్ల్స్ హైస్కూల్లో. అమ్మాయిల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టటం పెద్ద విషయం కాకపోయినా అవి ఎప్పుడాగిపోతాయో చెప్పలేము. ఎక్కువ మంది విషయంలో కుటుంబ అవసరాల ప్రకారమే అమ్మాయిల చదువులు సాగేవి.

అంతెందుకు తను ఆరో తరగతి ఎలిమెంటరీ స్కూల్లో చదివి ఏడో తరగతి హైస్కూల్లో చేరింది. అది అమ్మాయిల స్కూల్. క్లాస్ మేట్లందరూ తరువాతనైనా సరే హైస్కూల్లో తనతో కలిసి చదువుతారనుకుంది కానీ వాస్తవంగా జరిగిందేమిటి? అక్కడినుండి వచ్చి ఎనిమిదో తరగతిలో చేరిన వారి సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది.

మిత్రురాళ్ళు చెప్పే విషయాలు విని తను ఆశ్చర్యపోయేది. ఎక్కువ చదివితే పెళ్ళి కాదని, ఇంట్లోని పనులెవరు చేస్తారని, “నీ బావ ఏడో తరగతికే చదువు ఆపేసి పొలం పనులు చూసుకుంటున్నాడు. నీవు ఏడులోపే చదువు ఆపేయాలని” రకరకాల విషయాలు చెప్పారు వాళ్ళు. తనకు చాలా ఆశ్చర్యమేసింది. అదే విషయం నాన్నతో చెప్పింది తను. అప్పుడే ఏమయింది? నీ హైస్కూల్ అయిపోయాక ఇంటర్ కాలేజీలో చూసుకో ఇంకెంతమంది చదువాపేస్తారో” అన్నాడు నాన్న. అమ్మాయిల విషయమొక్కటే కాదనుకో కొంత మంది అబ్బాయిలదీ అదే పరిస్థితి” అని కూడా చెప్పాడు నాన్న. అయితే మొదట దెబ్బ తినేది అమ్మాయిల చదువులేననీ చెప్పాడు.

సరే జీవితంలో ఒకరి కోసమని మనం మన పరుగును ఆపలేము. వెనుక నుండి వచ్చే

వాళ్ళు తోసుకుని మరీపోతారు. నువ్వు ఆగావా, పడిపోయావా, పడితే ఎందుకు పడిపోయావు? అని ఎవ్వరూ అడగరు. చూస్తూ పోతారంతే. కొందరికి అలా చూసే ఓపిక, అవసరం అస్సలు ఉండవు.

తన చదువుని అలా కొనసాగిస్తుంది.

◆◆◆

తొమ్మిదో తరగతి మొదలై రెండు నెలలయింది. ఇంకా క్వార్టర్లీ పరీక్షలు జరగలేదు. కొత్తమ్మాయి చేరింది క్లాసులో. పేరు ఉమ. గుంటూరు నుండి వచ్చింది. వాళ్ళ నాన్న కర్నూలుకు బదిలీపైన వచ్చారు. జిల్లా అంతా తిరిగి పంట కాలువలు, బావులు ఎలా ఉన్నాయో తనిఖీ చేసే అధికారి ఆయన. మనోరమ టీచరుకు నేను పెట్. అందుకే ఉమని నా పక్కన కూర్చోబెట్టింది. అలా వచ్చిన రోజే పరిచయమైంది ఉమ. కొత్త స్కూలు, కొత్త ఊరు, ప్రాంతం కూడా కొత్త. అందుకే అన్నీ అలవాటయ్యేంత వరకు సున్నితంగా చూసుకోమంది టీచరు.

ఉమ కూడా బాగా కలిసిపోయింది. భాషల్లోని యాసవల్ల కొంత ఇబ్బంది కలిగినా అలవాటైపోయింది ఇద్దరికీ. తమ ఇంటి దగ్గర రాజమండ్రి వాళ్ళు ఉండటం కూడా తనకు కలిసొచ్చింది. మా ఇంటి దగ్గర కూడా కాకినాడ, తెనాలి, నెల్లూరు వాళ్ళున్నారని ఉమకి చెప్పి ధైర్యం చెప్పాను. నేను వాళ్ళలా మాట్లాడటానికి ప్రయత్నించటం ఉమ కనిపెట్టింది. ఇతరులతో ఒకలాగా ఉమతో ఒకలాగా మాట్లాడుతూ నేను రెండు యాసల్లో మెయింటెయిన్ చేసేదాన్ని.

పాత మిత్రురాళ్ళు లక్ష్మి, సరోజ, వాణి కొత్తగా వచ్చిన ఉమతో నా స్నేహాన్ని చూసి కొద్దిగా నొచ్చుకున్నారు. మొదట్లో నేను మాత్రం అందరితో కలిసే ఉండేదాన్ని. ఉమతో సహా పక్కనే ఉంటాను కాబట్టి ఎక్కువగా ఉన్నట్టనిపిస్తుంది ఇతరులకు. అదీకాక ఉమ వాళ్ళ ఇల్లు కూడా మా ఇంటి దగ్గరే. నోట్సు కోసమని, ఇంకోదానికని ఇద్దరం ఎక్కువగా కలిసే వాళ్ళం. సెలవు రోజైనా ఒక్కసారైనా చూసుకోవటం గ్యారంటీ. వినాయక చవితికి, దసరాకి అందరి ఇళ్ళకీ పోయేవాళ్ళం.

ఇక చదువు విషయంలో ఇద్దరికీ యమ పోటీ అనుకోవచ్చు. నువ్వా నేనా అన్నట్టు చదివేవాళ్ళం. నా మొదటి ర్యాంకు కొన్నిసార్లు ఉమకు పోవటమూ జరిగింది. లెక్కలు, సైన్సు, హిందీల్లో మాత్రం నన్ను దాటేది కాదు. మిగతావాటిల్లో ఎప్పుడూ తనే ముందుండేది. వాటిల్లో నేనేమాత్రం నిర్లక్ష్యం చేసినా తేడా పెరిగి మొదటి ర్యాంకును తనకిస్తున్నానేమోనన్న అనుమానం టీచర్లతో పాటు నాకూ కలిగేది. కానీ అవన్నీ ఒట్టి అపోహలు. ఉమ ఉమే చదువులో..

అలా అలా పదో తరగతి పూర్తై ఇంటరులో ప్రవేశించాం. నాన్న చెప్పింది. మరొకసారి అవగతమైంది నాకు. అదేమిటంటే పదో తరగతి ఫస్టు క్లాసులో పాసైన వారు కూడా కొంత మంది చదువాపేశారు. రకరకాల కారణాలు. వాటిల్లో ఎక్కువ భాగం చదువు మాన్పించటానికే కనిపెట్టారని నాకర్థమయింది. ఏమైతేనేం కొత్తగా మిత్రులు చేరారు. పాత వాళ్ళు తగ్గిపోయారు. కాలేజీలు, గ్రూపులు వేరైపోయాయి. బస్సుల్లో, షాపింగుల్లో, సినిమాల్లో, గుళ్ళలో,

ఎగ్జిబిషన్లలో మాత్రమే పాత మిత్రులు కనిపించేవాళ్ళు అబ్బాయిలు కొనసాగించినట్టుగా అమ్మాయిలు పాత స్నేహాల్ని కొనసాగించటం లేదని నాకనిపించింది. ఎవరినైనా కలవటానికి పోతామంటే “ఇంట్లో ఏదైనా పని చేసుకో, దేశాలు పట్టుకుని తిరగాల్సిన పని లేదు” అని కొందరు తల్లిదండ్రులు మా మిత్రురాళ్ళని అనటం నాకు తెలుసు. జీవితంలోని ప్రతి దశలో యుద్ధం చేయవలసిందేనని నాకర్థమయింది. నేను మాత్రం పాత స్నేహితుల్లో కొంత మందితోనైనా అప్పుడప్పుడు కలిసేదాన్ని.

నేను ఎం.పీ.సీ., ఉమ బై.పీ.సీ. తీసుకున్నాం అందరూ అనుకున్నట్టుగానే తనేమో డాక్టరు, నేనేమో ఇంజనీరునని మా ఇళ్ళలోనూ, బంధువుల్లోనూ అనేవారు. తనకి ఎం.బి.బిఎస్.లో వస్తే కర్నూలులోనే మెడికల్ కాలేజీ వుంది. బి.టెక్ చదవాలంటే మాత్రం అనంతపురం, తిరుపతి లేదా హైదరాబాదు పోవాలి. కర్నూలులో ప్రైవేట్ ఇంజనీరింగు కాలేజీ వస్తుందన్నారు. కానీ అది ఎంత వరకు నిజమవుతుందో తెలీదు. ఇద్దరం ఇంటర్‌లో ఇంగ్లీషు మీడియం తీసకున్నాం. సబ్జెక్టులు పాతవే ఐనా లోతుగా ఉన్నాయి. ఒక్కో టెక్స్టు బుక్ ఇంతింత లావుగా ఉన్నాయి. చదువులు మానెయ్యటానికి అదో కారణమేమో? చాప్టర్ల వారీగా చిన్నచిన్న పుస్తకాలుగా విడగొడితే బాగుంటుందని అనుకునే దాన్ని.

ఫిజిక్సు, కెమిస్ట్రీ ఇద్దరికీ ఉంటాయి. కాబట్టి వాటి గురించి నేను ఉమ మాట్లాడుకునే వాళ్ళం. రికార్డులు కూడా కలిసి రాసుకునే వాళ్ళం. ఉదయం, సాయంకాలం ఎంట్రెన్సు కోసం ట్యూషన్లు. అప్పుడు ఇన్ని కోచింగు సెంటర్లు లేనే లేవు. ఫిజిక్సుకు మోహన్‌రావు సార్, కెమిస్ట్రీకి నాగరాజు సార్. అంతే. వేరే అవకాశమే లేదు. చేతిలో చిన్న పేపర్ కూడా లేకుండా వాళ్ళు సబ్జెక్టు మొత్తం చెప్పేవాళ్ళు. మాకు ఒకటే ఆశ్చర్యం. మొత్తం మీద ఇంటరు కూడా మంచి మార్కులతో పాసయ్యా. అందరూ అనుకున్నట్టు, అన్నట్టు బి.టెక్, ఎం.బి.బిఎస్ సీట్లు రాలేదు మాకు. నెల్లూరుకు లాంగ్ టర్మ్ పంపమని కొందరి సలహా. కానీ మరో సంవత్సరం వృధా అని, అమ్మాయిల్ని ఒంటరిగా పంపలేక మమ్మల్ని బి.ఎస్సీలో పడేశారు. ఇక మూడేళ్ళు ఎవ్వరూ ఆలోచించనక్కరలేదు. యుద్ధాలు అన్నిసార్లు చేయలేము. రాజుకు ఇష్టమైన దేశంపైనే దండెత్తాలేగాని సైనికుడికి ఆ స్వాతంత్ర్యం లేదు. ఎటువంటి పరిస్థితిలోనైనా యుద్ధం చేయటం తెలిసుండాలంతే. అదే సైనికుడికి కావలసింది. చదువు విషయంలో ముఖ్యంగా అమ్మాయిలు సైనికులే గాని రాజు రాణి కాదు.

సబ్జెక్టులు మారకున్నా డిగ్రీ పుస్తకాలు కాబట్టి విషయం లోతుగా ఉంటుంది. ఇంటర్‌లో హడావుడి లేకపోయినా చదవటం మాత్రం ఎక్కువే. వారానికి ఒక రోజు కాలేజీ లైబ్రరీకి తప్పకుండా వెళ్ళాలి. మా సిలబస్‌లో కొడవటిగంటి వారి ‘చదువు’ నవల మాకు ఉపవాచకంగా ఉండేది. అందులో నాయకుడు సుందరాన్ని ఎంతో దూరం పంపి చదివిస్తారు. అలాగే శ్రీశ్రీ ‘ఖడ్గసృష్టి’ కవిత పద్యభాగంలో ఉండేవి. అది వింటుంటే మాకు ఏదో కొత్త ప్రపంచంలోకి పోయినట్టుండేది. ఆ కవిత ఒక్కటే కాదు

ఖడ్గసృష్టి పుస్తకంలో అలాంటి కవితలు ఇంకెన్నో ఉంటాయని లైబ్రరీలు వెతికి పట్టుకున్నా. అక్కడ మహాప్రస్థానం చూశాం. ఖడ్గసృష్టి హైడ్రోజన్ బాంబయితే మహాప్రస్థానం ఆటంబాంబులా తోచింది మాకు. నేనూ ఉమ లైబ్రరీలో పుస్తకాలు చదువుకుని వాటిపై చర్చించుకుని పోట్లాడుకుని లెక్చరర్‌తో మళ్ళీ చెప్పించుకునే వాళ్ళం. గురజాడ వారి కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మల పద్యాలు చదివాం. అమ్మాయిలు, స్త్రీల పరిస్థితి చాలా మారినా ఇంకా ఇంకా మారవలసింది ఎంతో ఉందని మేమనుకునేవాళ్ళం.

ఇద్దరి బీఎస్సీలు అయిపోయాయి. ఉమ బియ్యీడీలో చేరింది. నేను బ్యాంకు ఉద్యోగాలకు పరీక్షలు రాస్తున్నాను. తను ఆ తర్వాత టీచరు ఉద్యోగంలో చేరింది. నేను రాసిన నాలుగైదు బ్యాంకు రైల్వే పరీక్షల ఫలితాలు రావలసివుంది. నాన్నేమో అమ్మ బాధ పడలేక పెళ్ళి చేస్తామన్నాడు. పెళ్ళి మాట ఎత్తొద్దని గట్టిగా చెప్పాను. అనుకున్నట్టే ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగమొచ్చింది. క్లర్కుగా వనపర్తికి పోస్టింగ్ ఇచ్చారు. నాన్న, నేను బయలుదేరాం. ఉమ బెంగగా చూస్తూ నిలబడింది. తొమ్మిదో తరగతి నుండి దాదాపు పదేళ్ళు కలసేవున్నాం. ఓ సంవత్సరంలో తిరిగొస్తానని ధైర్యం చెప్పాను. వారానికి రెండు మూడు ఉత్తరాలు ఒక్కొక్కటి నాలుగైదు పేజీలు రాసేది. ఒక్కోసారి కవరుపై డ్యూ కూడా పడేది. ఆ ఉత్తర ప్రత్యుత్తరాలు మా స్నేహ బంధాన్ని ఇంకా బలోపేతం చేశాయి. మా మధ్య దూరం కిలోమీటర్లలో పెరిగింది. కాని అంతకు ముందు కంటే మానసికంగా బాగా దగ్గరయ్యాం.

సంవత్సరం కాకపోయినా ఒకటిన్నర సంవత్సరానికి కర్నూలు చేరాను. ట్రాన్స్‌ఫర్ మీద ఉమ కూడా ఓ ఇరవై కిలో మీటర్లున్న ఊరికి మారింది. బ్యాంకులో పనిచేసే నగేష్‌తో నాకు జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ భాస్కర్‌తో ఉమకు పెళ్ళిళ్ళు జరిగాయి. ఓ ఆరు నెలల తేడాతో మాకు ఒకమ్మాయి వాళ్ళకు ఇద్దరబ్బాయిలు పుట్టారు. పాతికేళ్ల కాలం గిర్రున తిరిగిపోయింది.

తెలుస్తూనేవున్నా తెలియనట్లే కాల చక్రం ఓ వీడియో గేమ్‌లాగా తిరిగినట్టయింది. అందుకేనేమో కాలం గురించి శాస్త్రజ్ఞులు, మేధావులు, కవులు పుంఖాను పుంఖాలుగా చెప్పేస్తుంటారు. రాసేస్తుంటారు.

దసరా అంటే మా ఇద్దరికీ ఇష్టమే. బొమ్మల కొలువులు పేరంటాలు వాళ్ళింట్లో మా ఇంట్లో చేస్తూనే ఉన్నాం. ఇతర మిత్రులు వస్తుంటారు. ఈ పాతికేళ్ళల్లో వాళ్ళ కుటుంబం మా కుటుంబం బాగా దగ్గరయ్యాయి. బంధువుల్లాగే ఉండేవాళ్ళం. అత్తయ్య మామయ్యలకు కూడా ఉమ వాళ్ళు బాగా అలవాటయ్యారు. 'అనుకున్నవి అనుకున్నట్టు కోరుకున్నవి కోరుకున్నట్టు జరుగుతూ పోతే అది జీవితమనిపించుకోదు.' అని ఉమ ఎప్పుడూ చెబుతుండేది. తన జీవిత కాలంలోనే పెద్ద విఘాతం ఎదురయింది. భాస్కర్‌కి ఉన్నట్టుండి గుండెపోటు వచ్చింది. రెండు రోజులక్కానీ చెప్పలేమన్నారు వైద్యులు. బాగానే ఉంది గాని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏమయిందో ఏమో వారంలోపే ఓ రోజు అర్ధరాత్రి రెండవసారి స్ట్రోక్ వచ్చి ఉమని, పిల్లల్ని ఒంటరిని చేసి వెళ్ళిపోయాడు. కోలుకోలేనంది ఉమ. పిల్లల కోసం గట్టిగా నిలవాలన్నాను. నెల రోజులుగా ఎక్కువ సమయం తనతోనే ఉంటున్నాను. రెండు నెలలు ఊరు మారతానంది. సెలవుపెట్టి గుంటూరుకు పోయింది. నెలకే పిల్లల చదువుల కోసమని తిరిగొచ్చింది. భావోద్వేగాల్ని అదుపులో పెట్టుకుని పిల్లల్ని బాగా చూసుకుంటోంది. స్కూలుకి కూడా పోతోంది. నన్ను మాత్రం రోజూ కలవమంది.

దసరా మళ్ళీ ఓ వారంలో మొదలు కానుంది. నవరాత్రులు ఈసారి అంత సవ్యంగా లేవనిపించింది. ఈ సారి పేరంటాలు, బొమ్మల కొలువులు చేయనన్నాను. ఆయన, అత్త, మామ నా బాధ అర్థం చేసుకున్నారు. ఉమ పరిస్థితి తనకు ఇబ్బందిగా మారిందని వారికీ తెలుసు. సర్ది చెప్పాను. ఉమతో ఈ విషయాలేవీ పంచుకోలేకపోయాను.

నవరాత్రులు మొదటిరోజే సెల్లు రింగయింది. ఉదయాన్నే ఉమ ఫోన్. తానీ సారి సెలవులకి అమ్మా వాళ్ళ ఊరెళుతున్నానని చెప్పింది. ఆ పాటికే బస్సు కర్నూలు దాటింది. తనకు ఇబ్బంది కలుగకూడదనే ఉమ ఇలా చేసిందని అర్థమైపోయింది. నాతో మాట మాత్రమైన చెప్పలేదని అనేశాను.ఈ మధ్య తనతో అంత గట్టిగా ఏమాట మాట్లాడలేదు. తనూ అనుకోలేదని సర్ది చెప్పబోయింది. "హ్యాపీ దసరా" అని ఫోన్ కట్ చేసింది. తన గొంతు లోని జీర నేనర్థం చేసుకోలేనా? అందుకే అలా చేసింది.

మౌనంగా సోఫాలో కూచున్నాను. నగేష్ వచ్చాడు. ఏమయిందన్నాడు . చెప్పాను. సర్ది చెబుతున్నాడు. పాప సుష్మ కూడా దూరం నుండి వింటోంది. అత్తమామలక్కూడా తెలుసు ఎందుకిలా జరుగుతుందో. లేచి తయారవుతున్నాను బ్యాంకుకి. అమ్మకి ఫోన్ చేశాను. ఈ సారి బొమ్మల కొలువుకి ఉమ ఎందుకు రాకూడదు? అని ప్రశ్నించాను. "పిలిచి ఇతరులను ఇబ్బంది పెడతావా" అంది. "ఉమ ఇబ్బంది వాళ్ళకి పట్టదా?" అని ప్రశ్నించాను. ఫోన్లో కాదుగాని సాయంకాలం ఇంటికి రమ్మంది అమ్మ. వెళ్ళాను. నాన్నను కూడా ఉండమని చెప్పి విషయం చెప్పాను. బొమ్మల కొలువుకి ఉమ వస్తోంది. ఎవ్వరూ ఆపలేరు" అని కచ్చితంగా చెప్పాను. "అత్తకు ఈ విషయం చెప్పావా?" అని అడిగారు. చెబుతున్నాను. "గో అహెడ్" అన్నాడు నాన్న. అమ్మ కూడా మెచ్చుకోలుగా చూసింది.

అత్తయ్యని కూడా ఓ అరగంట మాట్లాడాక మార్చగలిగాను. ఇక మిగిలింది ఉమే. ఫోనులో గంటసేపు సంభాషణ. ఈసారి వాయిదా వేయమంది. ప్రాధేయపడింది. నేను వదిలేరకం కాదని తనకి తెలుసు. ఇంకెన్నో మాట్లాడి నిజ జీవితంలోకి వచ్చేటప్పటికి మనిషి ప్రవర్తన ఎందుకిలా తయారవుతుంది? ఆ విషయమే ఉమని అడిగాను. కాలేజీ రోజుల్లో గురజాడ రచనలు చదివి గంటలు గంటలు మాట్లాడింది నేనేనా అని అడిగాను. తను చెప్పినది నేను చెప్పాలనుకున్నవి గట్టిగానే చెప్పాను. రెండు రోజుల్లో నా దగ్గర ఉండాలన్నాను. అలాగేనంది. అన్నట్టే వచ్చేసింది కూడా. ఉమ బొమ్మల కొలువుకి మా ఇంటికొచ్చింది పిల్లలతో సహా. నేను ఎటువంటి ఫీలింగు మొహంలో కనిపించకుండా అసలేమీ జరగలేదన్నట్టుగా ప్రతీ సంవత్సరంలాగే లోనికి పిలిచాను. పక్క రూములో కూర్చోబెట్టాను. కొద్దిగా స్థిమితపడింది. నేను పిలిచిన ముత్తయిదువులందరూ వచ్చి బొమ్మల కొలువులో కూచున్నారు. ఇక అందరూ రావటం పూర్తయిందనుకున్నాక ఉమని పిలిచాను. విషయం తెలిసిన కొందరు ఇబ్బందిగా కదిలారు. బొమ్మల కొలువు ముగిసింది. ఉమకే మొదటగా తాంబులమిచ్చాను. ఇక మిగతావారు తీసుకుంటారో లేదో వారి ఇష్టం. తప్పదన్నట్టు వరుసలో నిలబడ్డారు. కొందరు ముభావంగా తాంబూలం తీసుకున్నారు. ఇంకొందరు మెచ్చుకోలుగా చూశారు. ఇద్దరు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఉమకు కూడా. పిల్లలు అన్ని బొమ్మలతోనూ ఆడతారు. ఏ ఒక్క బొమ్మనీ పక్కన బెట్టరు. నాకు వారే స్ఫూర్తి. మనుషులు బొమ్మలకంటే చాలా చాలా ఎక్కువే. నేను ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. మనిషిని మనిషిగా చూశానంతే. రాత్రి పడుకోబోతుంటే సెల్లుల్లో ఎస్సెమ్మెస్ వచ్చింది. ఆశ్చర్యం నగేష్ ఫోన్ నుండి. "కంగ్రాట్స్ సత్యా" అనుంది.

✦

## ఖీమా హల్వా

**కావలసిన పదార్థాలు**

మీల్ మేకర్ ఖీమా :1/2 కిలో, చక్కెర :ఒక కప్పు
క్యారెట్ లేదా బీట్‌రూట్ :ఒక కప్పు తురుము
నెయ్యి :100 గ్రాములు
యాలకుల పొడి :చిటికెడు
జీడిపప్పు, ద్రాక్ష :25 గ్రాములు, పాలు :2 కప్పులు

**తయారు చేసే విధానం:**

ముందుగా మీల్ మేకర్‌లో కొద్దిగా ఉప్పు వేసి 5 విజిల్స్ వచ్చేదాకా ఉడికించి జార్‌లో ఖీమా బ్లేడ్ పెట్టి ఖీమాలాగా చేసి పెట్టుకోవాలి. స్టవ్ మీద బాణలి పెట్టి నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ వేయించి పక్కన పెట్టు కోవాలి. క్యారెట్ లేదా బీట్‌రూట్ తురుము వేయించి పక్కనపెట్టుకోవాలి. అదే బాణలిలో పాలు పోసి బాగా వేడి చేసి అందులో వేయించిన క్యారెట్, ఉడికించినసోయా ఖీమా వేసి తిప్పుతూ బాగా మెత్తగా ఉడకనిచ్చి యాలకుల పొడి వేసి నెయ్యి తేలేలాగా దగ్గర కానివ్వాలి. దించే ముందు వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసి దించాలి. ఇది కొద్దిగా చల్లారాక సర్వ్ చేసుకోవాలి. వెరైటీగా, రుచిగా ఉంటుంది.

# మీల్ మేకర్‌తో మజా

## దాల్చా

**కావాల్సిన పదార్థాలు**

మీల్‌మేకర్ : 100 గ్రాములు
కందిపప్పు : 50 గ్రాములు
కొబ్బరి : చిన్న ముక్కలు
కొత్తిమీర : నాలుగు రెమ్మలు
టమాటాలు : 4
చింతపండు రసం : ఒక కప్పు
ఉల్లి తరుగు : అర ఉల్లిపాయ
ఉప్పు : అర టీ స్పూన్
కారం : ఒక టీ స్పూన్
ధనియాల పొడి : 3 టీ స్పూన్‌లు
పసుపు : చిటికెడు

**తయారుచేసే విధానం**

ముందుగా సోయా ఉడికించి పెట్టుకోవాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి ఉడికించిన సోయా, ఉప్పు, పసుపు, 2 రెమ్మల కొత్తిమీర తరుగు వేసి 1నిమిషం సన్నని సెగ మీద తిప్పాలి. ఆ తరువాత టమాట ముక్కలు వేసి మెత్తగా ఉడకనివ్వాలి. కొబ్బరి మిశ్రమం, కంది బేడల మిశ్రమం, చింతపండు రసం వేసి 10 నిమిషాల పాటు బాగా ఉడకనివ్వాలి. కమ్మని సోయా మీల్‌మేకర్ దాల్చా రెడీ. ఇది అన్నం రోటీ, పూరీ ఎందులోకైనా రుచిగా ఉంటుంది. ఆయిల్ లేకుండా కూడా వండుకోవచ్చు.

## పులావ్

**కావలసిన పదార్థాలు:**

మీల్‌మేకర్ : 250 గ్రాములు
బాస్మతి బియ్యం: 250 గ్రాములు
నెయ్యి, నూనె : 100 గ్రాములు
ఉప్పు : ఒక టేబుల్ స్పూన్
దాల్చిన చెక్క: ఒక ముక్క
అల్లం :25 గ్రాములు
వెల్లుల్లి రెబ్బలు :ఒక గుప్పెడు
యాలకులు : 3
లవంగాలు : 15
బిర్యానీ ఆకులు : 2
పుదీనా : నాలుగు రెబ్బలు
పచ్చిమిర్చి : 4
ఉడికించిన గ్రీన్ పీస్ :50 గ్రాములు
ఆలు ముక్కలు :1 చిన్న కప్పు
ఉల్లి తరుగు :ఒక చిన్న కప్పు

**తయారు చేసే విధానం:**

ముందుగాఆలు ముక్కలు, గ్రీన్‌పీస్, సోయా (మీల్‌మేకర్) విడివిడిగా ఉడికించుకోవాలి. స్టవ్‌పై చిన్న కుక్కర్ పెట్టి నెయ్యి, నూనె వేసి కొద్దిగా వేడి చేయాలి. యాలకులు, దాల్చిన చెక్క , సగం అల్లం, సగం వెల్లుల్లి పేస్టు వేసి వేయించాలి. అందులోనే బిర్యానీ ఆకులు, కొత్తిమీర, పుదీనా, ఉల్లితరుగు వేసి వేయించాలి. ఆ తర్వాత మిగతా అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి మంచి వాసన, రంగు, రుచి వచ్చేదాకా వేయించి, గ్రీన్ పీస్ , ఆలు ముక్కలు, సోయా ముక్కలు ఉడికించినవి వేసి వేయించి తగినంత నీరు (2 కప్పులు) ఉప్పు వేసి కడిగిన బియ్యం వేసి 4 విజిల్స్ వచ్చే వరకు ఉంచాలి. మంచి సోయా పులావ్ రెడీ. దీన్ని సోయా ఖుర్మా లేదా బగారీ ఖుర్మా లేదా పుదీనా చట్నీతో తినవచ్చు. చాలా రుచిగా ఉంటుంది. త్వరగా అయిపోతుంది.

దాల్చా

పులావ్

## బుజ్జి స్టార్

**హా**య్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోయిన్‌ని. వర్షంలో నేను పాడిన పాటకు చాలా మంచి గుర్తింపు వచ్చింది. అన్నట్టు ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

[illegible]

## పదాలు గుర్తించండి

**మ**నిషి ఆకారంలో ఈ చిత్రంలో బోలెడన్ని అక్షరాలు దాగున్నాయి కదూ.
ఈ చిత్రంకు అటు, ఇటుగాపదాలున్నాయి. వాటిని నిలువుగా, అడ్డంగానైనా కిందనున్న చిత్రంలో గుర్తించండి.
కుదిరితే డిక్షనరీలో చూసి వాటి అర్థాలు తెలుసుకోండి.



| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| R | A | C | O | R | N | X | S | N |
| N | E | F | A | E | L | Q | C | I |
| D | U | T | Q | X | U | V | A | K |
| H | U | T | A | I | C | H | R | P |
| A | C | C | R | E | S | U | E | M |
| P | D | R | K | A | W | R | C | U |
| P | E | N | U | S | A | S | R | P |
| L | C | Q | I | K | U | W | O | E |
| E | S | N | E | W | J | A | W | A |
| K | C | A | T | S | Y | A | H | R |

ACORN
APPLE
DUCKS
HAYSTACK
LEAF
NUT
PEAR

PUMPKIN
RAKE
SCARECROW
SQUASH
SQUIRREL
SWEATER
WIND

## సేవకులు ఎందరు?

**ఈ** చిత్రంలో ఒక నగరానికి చెందిన రాజు వేట కోసం అడవికి బయలుదేరాడు. ఆ రాజును గుర్తించండి. రాజుతో పాటు కొంత మంది సేవకులు కూడా వున్నారు. ఇంతకీ వాళ్లలో ఎంత మందిని గుర్తు పట్టగలరు?

## ఆకుల జింక

**జిం**కలు ఆకులు, అలమలు తింటాయి కదా. ఆ ఆకులతోనే జింక బొమ్మ చేసేశాడు ఆర్టిస్టు అంకుల్. మీరు కూడా మీ ఇంటి దగ్గరలో దొరికిన ఆకులతో ఇలాంటి జింకను తయారు చేయండే.

## పదాలు పూరించండి

ఇక్కడ అయిదు బొమ్మలు...పక్కనే వాటి పేర్లు ఇంగ్లిష్‌లో వున్నాయి. కాకపోతే అన్నిట్లో ఒక్కో అక్షరం మిస్సయింది. మీరు సరైన ఒక్క అక్షరం కలిపితే పదం పూర్తి అవుతుంది.

c....p



b....ll

p....t



....gloo



t....nt

జవాబు: U, A, O, I, E

## మొత్తం ఎన్ని?

చింటూ సాయంకాలం సరదాగా పార్క్ వెళ్ళాడు. అక్కడ బోలెడన్ని పక్షులు కనిపించాయి. ఇంతకీ అవి మొత్తం ఎన్ని? వాటిని గుర్తించండి.

## కత్తిరించి అతికించండి

బుజ్జి పక్షి పిల్ల తల్లి బొమ్మను ఓ అల్లరి పిల్లాడు కత్తిరించేశాడు. మీరు మంచి పిల్లలు కదా. జాగ్రత్తగా ఏ ముక్క ఎక్కడ అతికిస్తే పక్షి పిల్ల తల్లి తయారవుతుందో చూడండి.

## పాండా 'చీమలు'

మీకు పాండాలంటే భలే ఇష్టం కదూ. బొద్దుగా నలుపు తెలుపు రంగుల్లో చాలా ముద్దుగా ఉంటాయి కదూ. పాండా 'చీమలూ' అలానే ఉంటాయి. నిజానికివి చీమలు కావు. కందిరీగ జాతికి చెందినవి. కందిరీగల్లో ఉన్న 3000 జాతుల్లో ఇవి చాలా ప్రత్యేకమైనవి. చూడటానికి ముచ్చటగా ఉండే ఇవి చాలా ప్రమాదకరమైనవి కూడా. ఇవి గానీ కుడితే ఆవులు వంటి పెద్ద పెద్ద జంతువులు కూడా చనిపోతాయి. వీటిని కౌ కిల్లర్స్ అని కూడా అంటారు. విచిత్రంగా, అందంగా ఉండే ఇలాంటి కీటకాలు, పురుగులు కనిపిస్తే గబుక్కున ముట్టుకోకండే. చాలా దూరంగా ఉండే వాటిని గమనించండి.

- ఇవి దక్షిణ అమెరికాలోని చిలీ దేశ తీర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- అమెరికా దక్షిణ రాష్ట్రాల్లోను, మెక్సికోలోనూ కనిపించే ఇవి ఇసుక, గులకరాళ్ల మధ్య దాక్కుంటాయి.
- వీటి ఒంటి మీద దట్టమైన వెంట్రుకలు ఉంటాయి.
- వీటి దేహాలు చాలా దృఢంగా ఉంటాయి. వేరే కీటకాల ఆవాసాల్లోకి చొచ్చుకుని వెళ్లిపోతాయి.
- 8 మి.మీ. పొడవు, 3 మి.మీ. ఎత్తుండే ఈ చీమలు చాలా చురుగ్గా కదులుతాయి.
- మగవాటిని, ఆడవాటిని చాలా తేలిగ్గా గుర్తుపట్టేయొచ్చు.
- ఆడవాటికి రెక్కలుండవు. మరో విషయమేంటంటే ఇవే కుడతాయి.
- వీటికి ఉండే కొండేలను కదిలించి ఓ రకమైన శబ్దం చేస్తాయి. ఇలా మిగతా వాటికి సిగ్నల్స్ ఇస్తాయి.
- మగవి రాత్రుళ్లు తిరిగితే, ఆడవి సాయంత్రాలు చాలా యాక్టివ్‌గా ఉంటాయి.
- పూలలోని మకరందమే వీటి ఆహారం.

**పంజాబ్ వెళ్లి ...మిత్రుల ఇంటికి ...దారి తప్పారంటే ఇక మీరెక్కడికీ తిన్నగా వెళ్లలేరనొచ్చు అక్కడి నీటి ట్యాంకుల కథాకమీమిషు తెలుసుకుంటే. కొండ గుర్తులతో, జీపీఎస్‌లతో పని లేదు. 'అదిగో కనిపిస్తున్న ఆ విమానం పక్క సందు దాటితో ఓ పెహల్వాన్ తగులుతాడు. వాణ్ని దాటేస్తే ... గద్ద బొమ్మ ఉన్న ఇల్లే' అని తేలిగ్గా చిరునామా చెప్పేస్తారు. దారెంట స్ట్రెయిట్‌గా వేలి పెట్టి చూపించరు. ఇళ్ల పైకి చేతిని కదుపుతూ గుర్తులు చెబుతుంటారు. వారు చెప్పినంత తేలిగ్గా సరాసరి వెళ్లి ఆ ఇంటి కాలింగ్ బెల్ నొక్కొచ్చు. ఈ విమానాలు, ట్రాక్టర్లు, పెహల్వాన్‌లు, గద్దల మైల్‌స్టోన్లు, ల్యాండ్ మార్కులన్నీ కూడా ఇంటిపై ఉండే నీటి ట్యాంకులే. ప్రతి భవంతిపై కొట్టొచ్చినట్టు కనిపించే అవి వారి స్టేటస్ సింబల్స్. వృత్తి, ప్రవృత్తులకు ఇండికేటర్స్. అక్కడ ఇల్లు కట్టి కాదు ట్యాంకు పెట్టి చూపించాలి.**

# ట్యాంకెడు పంజాబీదనం

పంజాబ్ వ్యవసాయ సీమల గురించి, సైనికులను అందించే గ్రామాల గురించి, ఇంటికొకరు చొప్పున విదేశాల్లో వాలిపోయే ఎన్నారైల గురించి ఇక బోలెడు విషయాల గురించి ప్రస్తావన, పరిచయాలు అవసరం లేదు. దేశంలో సుభిక్ష ప్రాంతాల్లో అదొకటి. భాంగ్రా నృత్యాలకు విలాసవంతమైన లిమోజిన్ బారు కార్లకు లంకె కట్టేసి పెళ్లి నుంచి గృహ ప్రవేశాల వరకు అతి భారీగా వేడుక చేసుకునే సంపన్నులెందరో. వారి డాబూదర్పం ప్రదర్శనకు నీటి ట్యాంకుల్ని కూడా వాడేస్తుంటారు. మొత్తం వారి సంస్కృతి అంతటిని రంగరించి ఇళ్లపై బొమ్మల కొలువును ఏర్పాటు చేసినట్టు ఉంటాయవి. ముఖ్యంగా బియాస్, సట్లెజ్ నదుల మధ్య ఉన్న బిస్త్ దోబియా ప్రాంతంలో. ఎన్నారై హబ్‌గా పిలవబడే ఇక్కడి ప్రాంతంలో దాదాపు ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి కెనడా, ఆస్ట్రేలియా, యూకే వెళ్లి స్థిరపడతారు. పొట్ట చేతబట్టుకుని అరబ్ వెళ్లే మనోళ్ల వలస బతుకుల దుస్థితి కాదు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల గురించి. అందుకే విదేశీ మారకం బాగా సమకూరుస్తుంటారు ఇంటింటికీ. పెద్ద ఎత్తున వచ్చే డబ్బుతో ఇక్కడి కుటుంబాలు తమ విలాసానికి నీటి ట్యాంకుల్ని లిస్ట్‌లో ముందు వరసలో పెట్టేశారు. తొలుత జలంధర్, లూధియానా, అమృత్‌సర్ వంటి పెద్ద నగరాల్లో ఈ ట్యాంకులు కళకళలాడాయి. ఎన్నారైలకు సూచనగా భారీ విమానాలను పోలే ట్యాంకులు అక్కడి భవంతుల మీద సర్వసాధారణంగా కనిపిస్తాయి. లూధియానా–జలంధర్ జాతీయ రహదారిపై వెళుతుంటే అక్కడి పతాకస్థాయి ట్రాన్స్‌పోర్ట్ రంగానికి చిహ్నంగా ఎన్నో ట్రక్కులు, వ్యానులు, కార్ల ఆకృతుల్లో కనిపించే నీటి ట్యాంకులు ఇళ్లపై కనిపిస్తాయి. చండీగఢ్‌కు దారితీసే ఫాగ్వారా బైపాస్‌లో వెళుతుంటే కార్లు పక్కన భవంతులపై పార్క్ చేసినట్టుంటాయి. ఇక సైనికుల కుటుంబాల వారు తమ దేశభక్తిని, స్ఫూర్తిని యుద్ధ ట్యాంకులు, షిప్‌ల ఆకృతుల్లో ఉండే నీటి ట్యాంకుల ద్వారా చాటుకుంటారు. సెలవులపై వచ్చే బిడ్డలకు అవి మరింత ఉత్తేజాన్నిచ్చి అంకితభావాన్ని పెంచుతాయని అంటారు. క్రీడా పరికరాల్ని భారీ స్థాయిలో ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో ఫుట్‌బాల్, క్రికెట్ బ్యాట్‌లు, హాకీ స్టిక్‌లు ఇలా అనేక ట్యాంక్‌లను ఆటల పోటీలా ఒకదాన్ని మించి ఒకటి ఉండేలా నిర్మించుకుంటారు. మందు బాటిళ్ల రూపంలోను వారి 'పాటియాలా పెగ్' స్పోర్టివ్ స్పిరిట్ కూడా ట్యాంకుల్లోనే కనిపిస్తుంది. పంజాబీలకు అతి పవిత్రమైన అమృత్‌సర్‌కు చుట్టు పక్కల ప్రాంతాల్లో గద్దను పోలిన ట్యాంకులు ఎక్కువగా కనిపిస్తాయి. బాజ్వా వంశస్తులకు గద్ద ఇంటిపై వాలడం శుభసూచిక. అందుకే కాంక్రీట్ గద్దల్ని ట్యాంకుల్లా వాల్చేసుకుంటారు. నగరాల నుంచి గ్రామాల్లోకి విస్తరించిన ఈ అత్యపసర అభిరుచి అనేక ఆకృతుల్లోకి మారింది. ఎద్దుల బండి పోయి ట్రాక్టర్లు వస్తే ఆ మార్పులు అక్కడి భవంతులపై కళ్లకు కడతాయి. సింహాలు, పద్మాలు ఆఖరకు ఉడతల రూపాల్లో ట్యాంకులు షేప్ తీసుకుంటాయి. జాండియాలా, లంబారన్, ఉప్పల్ భూపా, కర్తార్‌పూర్, షాల్‌కోట్ వంటి గ్రామాలు, పట్టణాల్లో ఏదో ఉత్సవాల్లో పండాళ్లు (మండపాలు) అలంకరించినట్టు భవంతులపై ముచ్చటైన భారీ బొమ్మల కొలువులా దారెంట కనిపిస్తాయి. ఏదో ఫిల్మ్ సెట్టింగ్‌లోకో మోడల్ థీమ్ పార్క్ సందిట్లోకో వెళ్లిన భావన తప్పక అనిపిస్తుంది. కేవలం కళాత్మక ట్యాంకుల్ని పెట్టేసుకోవడమే కాదు వాటిని అందంగా ముస్తాబు చేసుకోవడం ఎప్పటికప్పుడు నగిషీలు అద్దడం ఇదే తీరుబడి. ఇదంతా ఓ 70 ఏళ్ల క్రితం నుంచి మెల్లిగా మొదలైంది. 60 ఏళ్లుగా ఈ అందమైన నీటి ట్యాంకుల తయారీలో తరాలుగా కొనసాగుతున్న కుటుంబాలు ఉన్నాయి. బీహార్ నుంచి వచ్చే కళాకారులెందరో పంజాబ్‌లో స్థిరపడి దోబియాల ట్యాంకుల ముచ్చట తీరుస్తున్నారు. నీటి నిర్మాణంలో ఓ టెక్నిక్ వాడుతుంటారు.

మధ్యగా రెండు భాగాలుగా ట్యాంకు ఆకృతుల్ని తయారుచేసి లోపల నునుపుదనం తెచ్చి ఆ తర్వాత భవంతిపై ఆ రెండిటినీ చాలా జాగ్రత్తగా కలుపుతారు. ఎక్కడా కూడా రెండు ముక్కలనే లోపం కనిపించకుండా ట్యాంకును రూపొందించడం మెచ్చుకోదగ్గ విషయం. కొన్ని ట్యాంకులకు రెడీమేడ్ పోత పని ఉంటే కొన్నింటిని యజమాని అభిరుచులకు తగ్గట్టు అప్పటికప్పుడు రూపకల్పన చేస్తారు. కొన్ని భారీ ట్యాంకుల తయారీకి నాలుగైదేళ్ల సమయం కూడా పడుతుంది. ఎప్పటికప్పుడు కొత్త వాటికి అవకాశమిస్తూ పాత వాటిని వర్ష నీటి నిల్వలకు వాడుతున్నారు. ధనికులే కాదు సామాన్యులకు కూడా ఈ బొమ్మ ట్యాంకుల ముచ్చట ఎక్కువైంది. ఉన్నంతలో తీర్చిదిద్దుకుంటారు. నీటి ట్యాంకును చూసి ఇక్కడ ఇంటి యజమానిని చూడాలి. ముందు అదే స్వాగతం పలుకుతుంది మరి.

నీలాకాశం రంగును ప్రతిబింబించే సంద్రానికి మబ్బుల లోటును తీర్చేస్తాయి ద్వీపాలు. వాటి ఆకృతులు ఆకాశానికి ఈర్ష్యా పుట్టిస్తాయి. సముద్రంపై నెలవంకను చూడాలంటే హవాయి వెళ్లండి. మౌకీ, కహోఓలావే ద్వీపాల మధ్య ఉండే మలోకిని ద్వీపం అలాగే ఉంటుంది. చుట్టూ పగడాల దిబ్బలతో కనువిందు చేస్తుంది. కడలిలో చంద్రుడేంటి అక్కడి జీవాల రూపాలు ఉండాలి గానీ అంటే. ఈక్వెడార్‌లోని ఇసబెలా ద్వీపం నీటి గుర్రంలా కనిపిస్తుంది. ఆరు అగ్నిపర్వతాలు ఒక్కసారిగా బద్దలైనపుడు పది లక్షల ఏళ్ల క్రితం ఇది ఏర్పడింది. దక్షిణ ఇటలీ అమాల్ఫీ కోస్తా దగ్గరి సైరునీస్ ద్వీపం డాల్ఫిన్, క్రొయేషియాకు చెందిన ఉత్తర ఆడ్రియాటిక్ సముద్రంలోని బ్రుజునీ దీవి చేపలా ఆకృతి పొందాయి. ఇక్కడ 200 రాక్షసబల్లుల పాద ముద్రలు చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. సైరునీస్ దీవి యులిసిస్ గాథలో కైపునెక్కించే ఘట్టానికి ఏకాంత మందిరమది. ప్రేమ ఘట్టమనగానే గుర్తొచ్చింది అచ్చు లవ్ సింబల్‌ను పోలిన దీవి ఫిజీలో ఉంది. పగడాలను చుట్టూ నింపుకున్న దీని అసలు పేరు టవారువా. ప్రకృతిని అటుంచితే మనిషి చేతిలో రూపుదిద్దుకున్నవాటిలాను ద్వీపాలున్నాయి. ఫిలిప్పీన్స్‌లో హెలికాప్టర్‌ను పోలిన డిలూమకాడ్ దీవి దట్టమైన వర్షారణ్యాన్ని నింపుకుని ఉంటే.. మలేషియా దగ్గరలో బూమర్యాంగ్‌లా కనిపించే స్పార్టీ దీవి సహజవాయువు, చమురు నిక్షేపాలకు నెలవు. ★

# ద్వీప కల్పన

# ...ఫోటోషాపుతో పనేల!

**క**ంప్యూటర్, ఇంటర్నెట్ చేతిలో వుంటే చాలు. గంటల తరబడి కుర్చీలకు అతుక్కుపోయి రకరకాల జంతువులను సృష్టిస్తుంటారు కొందరు నెటిజన్లు. తమకు నచ్చిన జంతువుల శరీర భాగాలను కలిపి ఒక కొత్త ప్రాణికి ప్రాణం పోయడంలో చెప్పలేనంత సంతృప్తి చెందుతుంటారు. అయితే ఇవాళ మీ ముందుకొచ్చిన ప్రాణులు అలాంటి ఫొటోషాప్‌లో తయారైనవి కావు. శాస్త్రవేత్తలు సృష్టించిన హైబ్రిడ్ బేబీలు. టైగన్, కామా, బీఫెలో, కోయ్ వోల్ఫ్, వోల్ఫిన్, గ్రోలార్ బేర్. చదవడానికి, పలకడానికి వింతగా వున్నా... బాగా పరిచయమున్న పేర్లు, ముఖాలుగానే అనిపించడం లేదూ. వీటి పేర్లను బట్టే ఏయే జంతువులను కలిపి వీటిని పుట్టించారో అర్థం చేసుకోవచ్చు. టైగర్, లయన్ తనయ టైగన్. పోలార్ బేర్, బ్రౌన్ బేర్ పుత్రుడు గ్రోలార్ బేర్. కొయెటి, వోల్ఫ్ గారాల బిడ్డ కోయ్‌వోల్ఫ్. వేల్, బోటిల్ నోస్ డాల్ఫిన్ డార్లింగ్ వోల్ఫిన్. బఫ్ఫెలో, కౌ కుట్టి బీఫెలో. కేమెల్, లామా ముద్దు బిడ్డ కామా.

ఇప్పుడు పేర్లను, పోలికలను సరిపోల్చుకుంటే సరి!